# ఉద్భవ

స్త్రీ మరియు పిల్లల సంక్షేమం /
స్వేచ్ఛ / హక్కుల మాస పత్రిక

Regn. No. 87195 (APTEL/2005/14638)

**Volume:19 Issue: 6 * September 2025 * Pages: 72 Rs.10**



Founder and Editor in Chief

**Dr. M. Madhava Vasu**

M.A., M.H.R., M.Phil (JMC),
P.G.H.R., Ph.D., F.D.R.
(Nalsar), B.P.R., DEE.

**Advisors:**

**Sri M. Madhusudhan Reddy**
Advocate

**Sri P. Balreddy**
Advocate

**Sri S. Mohan Rao**
Journalist

Kakinada Correspondent :
**Sri D. Venugopal Rao**


## లోపలి పేజీల్లో...


- మహిళా జడ్జిల నియామకంలో తెలంగాణ హైకోర్టు టాప్ 3
- హైకోర్టు కంటే సుప్రీంకోర్టు ఎక్కువ కాదు, తక్కువ కాదు 5
- కామెడీ పేరుతో ఎగతాళి చేస్తారా? 8
- భర్త చేతిలో భార్య సజీవదహనం 12
- గర్భిణిని కడతేర్చిన కిరాతక భర్త 14
- భళా సుష్మిత! 21
- గిరిజన యువతి అరుదైన ఘనత 23
- పెంచిన తల్లిదండ్రులకే ఆ పిల్లల్ని ఇవ్వండి 26
- లైంగిక సమ్మతికి 18 ఏళ్లు తప్పనిసరి 35
- నిత్యపెళ్లికొడుకుపై పోక్సో కేసు 37
- హాస్టల్లో విషప్రయోగం 43



**UDBHAVA**
Edited, Printed, Published and Owned by **Dr. M. Madhava Vasu**
Published at 1-24-21/4, (24-387), Plot No.1, Sri Sai Nagar, Lothukunta, Alwal, Secunderabad - 500 015, Telangana, India. Phone: 040-27960130 - Mobile : +91 9848861801
email: madhavvasumanchiraju@gmail.com


**UDBHAVA**
Carries proudly the messages of society of all sections of people, especially women and children, downtrodden section of peoples rights and deprivation of any Human Rights to any section of people.


**DISCLAIMER**
The views, opinions and expressions in various ariticles, NGO and are those of Authors, Human Rights Watch, different news papers and PTI are their respective views and stature of UDBHAVA holds no responsibility.



**ACKNOWLEDGEMENT OF THE SOURCE**
The National Human Rights Commission news letters, State Human Rights Commission Reports, Mahila Commission reports, Articles of the News Papers, PTI reports, Monthly Magazines, Books and International Human Rights Watch, Andhra Pradesh and Telangana State Governments Schemes for Women and Children.

## సంపాదకీయం

# మహిళా జడ్జిల ప్రాతినిధ్యం పెరిగేదెన్నడు?!

సాధికారతలోనూ, విద్యలోనూ భారతీయ మహిళలు ముందంజ ఉంటున్నారు. అవకాశాలను అందిపుచ్చుకుని రాణిస్తున్నారు. అయితే కొన్ని రంగాల్లో వారికి దక్కాల్సిన ప్రాతినిధ్యం దక్కడం లేదు. దేశ జనాభాలో సగభాగం ఉన్నా ఆశించిన స్థాయిలో వారి నియామకాలు జరగడం లేదన్నది నిర్వివాదాంశం. రాజకీయ రంగమైనా, న్యాయవ్యవస్థలోనైనా మహిళా ప్రాతినిధ్యం అంశం ఎప్పుడూ చర్చనీయాంశమే. అటు చట్టసభల్లోనూ, ఇటు జడ్జిల సంఖ్యలోనూ వారి సంఖ్య నేటికీ అంతంతమాత్రమే. తాజాగా విడుదలైన గణాంకాల ప్రకారం సుప్రీంకోర్టు నుంచి హైకోర్టుల వరకూ మహిళా న్యాయమూర్తుల సంఖ్య నామమాత్రంగా ఉంది. కొన్ని హైకోర్టుల్లో మహిళా న్యాయమూర్తులే లేరంటే అతిశయోక్తి కాదు. అయితే తెలంగాణ హైకోర్టు మాత్రం మహిళా న్యాయమూర్తుల నియామకంలో పెద్దపీట వేసింది. 30 మంది న్యాయమూర్తుల్లో 10మంది మహిళా న్యాయమూర్తులు ఉన్నారు. మహిళా జడ్జిల నియామకానికి పెద్దపీట వేసిన తెలంగాణ హైకోర్టు అగ్రభాగాన నిలిచింది. భారత న్యాయవ్యవస్థకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. రెండో స్థానంలో సిక్కిం హైకోర్టు, తొమ్మిదో స్థానంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టులు నిలిచాయి. సుప్రీంకోర్టు నుంచి హైకోర్టుల వరకూ తెలంగాణ హైకోర్టు మినహా ఏ కోర్టులోనూ న్యాయమూర్తుల సంఖ్య నామమాత్రమే. ఎనిమిది రాష్ట్రాల హైకోర్టుల్లో ఒక్కొక్కరు మాత్రమే మహిళా జడ్జిలు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ విషయానికొస్తే 30 మందిలో ఐదుగురు మహిళా న్యాయమూర్తులే ఉన్నారు. ఉత్తరాఖండ్, త్రిపుర, మేఘాలయ హైకోర్టుల్లో ఇప్పటివరకు ఒక్క మహిళా జడ్జి కూడా లేకపోవటం అత్యంత శోచనీయం. మధ్యప్రదేశ్, బిహార్, ఛత్తీస్‌గఢ్, గువాహటి, సిక్కిం, మణిపూర్ హైకోర్టుల్లో బార్ కౌన్సిల్ నుంచి నేరుగా ఒక్క మహిళా న్యాయమూర్తి కూడా నియమితులు కాలేదు. ఇక అత్యున్నత స్థానమైన సుప్రీంకోర్టులోనూ అదే పరిస్థితి. సుప్రీంకోర్టు ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు 279మంది న్యాయమూర్తులు పనిచేస్తే వారిలో మహిళల సంఖ్య కేవలం 11 మాత్రమే. ప్రస్తుతమున్న 33మంది న్యాయమూర్తుల్లో కేవలం ఇద్దరు మాత్రమే మహిళా జడ్జిలు ఉండటం శోచనీయం. మహిళా జడ్జిల నియామకంలో ఇప్పటికైనా చొరవ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# మహిళా జడ్జిల నియామకంలో తెలంగాణ హైకోర్టు టాప్

## మహిళా న్యాయమూర్తుల సంఖ్యలో దేశంలోనే మొదటి స్థానం

## 30మందిలో 10 మంది మహిళా న్యాయమూర్తులు

## తొమ్మిదో స్థానంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు

## 'సెంటర్ ఫర్ లా అండ్ పాలసీ రిసెర్చ్' నివేదిక



భారత న్యాయవ్యవస్థలో మహిళా ప్రాతినిధ్యం చాలా కాలంగా చర్చనీయాంశంగా ఉంది. ఇటీవల విడుదలైన సెంటర్ ఫర్ లా అండ్ పాలసీ రీసెర్చ్ నివేదిక ప్రకారం.. దేశవ్యాప్తంగా ఉన్న హైకోర్టులు, సుప్రీంకోర్టులో మహిళా న్యాయమూర్తుల శాతం ఇంకా చాలా తక్కువగా ఉన్నప్పటికీ, తెలంగాణ హైకోర్టు మాత్రం ఈ రంగంలో ముందంజలో ఉంది. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టులో మొత్తం 30 మంది జడ్జిలు ఉన్నారు. వారిలో 10 మంది మహిళలు. అంటే హైకోర్టులో జడ్జిల సంఖ్యలో మహిళా ప్రాతినిధ్యం 33.3 శాతం వరకు ఉంది. రెండో స్థానంలో సిక్కిం హైకోర్టు నిలిచింది. అక్కడ ఉన్న ముగ్గురు జడ్జిల్లో ఒకరు మహిళ. ఈ తరహా గణాంకాలు చూస్తే, రాష్ట్రాలవారీగా మహిళల స్థానం ఎలా మారుతుందో స్పష్టంగా తెలుస్తుంది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఈ జాబితాలో తొమ్మిదో స్థానంలో ఉంది. ఏపీలో ప్రస్తుతం 30 మంది జడ్జిల్లో ఐదుగురు మహిళలు ఉన్నారు. అంటే శాతం వారీగా చూస్తే, తెలంగాణతో పోలిస్తే మహిళా ప్రాతినిధ్యం తక్కువగానే ఉంది. ఇంకా దేశంలోని ఎనిమిది హైకోర్టుల్లో ఒక్కొక్కరు మాత్రమే మహిళా జడ్జిలు ఉండగా, మరికొన్ని మూడు హైకోర్టుల్లో అయితే ఇప్పటికీ మహిళా జడ్జిలే లేరు.

### సుప్రీంకోర్టులో మహిళల స్థితి..

సుప్రీంకోర్టు స్థాయిలో పరిస్థితి మరింత ప్రత్యేకంగా ఉంది. ప్రస్తుతం సుప్రీంకోర్టులో 33

మంది న్యాయమూర్తులు పనిచేస్తుండగా, వారిలో కేవలం ఇద్దరు మహిళలే ఉన్నారు. అంటే మొత్తం మీద 6.06 శాతం మాత్రమే. ఇది దేశ అత్యున్నత న్యాయస్థానానికి సరిపోలని గణాంకం అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సుప్రీంకోర్టు ఆవిర్భవించినప్పటి నుంచి ఇప్పటి వరకు 279 మంది న్యాయమూర్తులు పనిచేసినా, వారిలో మహిళల సంఖ్య కేవలం 11 మాత్రమే. ఈ జాబితాలో తొలి మహిళా జడ్జి 1989లో నియమితులైన జస్టిస్ ఫాతిమా. మరోవైపు, 58 ఏళ్ల వయసులో సుప్రీంకోర్టులో ప్రమాణ స్వీకారం చేసిన జస్టిస్ రూమాపాల్ అత్యంత పిన్న వయస్కురాలిగా చరిత్రలో నిలిచారు.

2013లో తొలిసారిగా మహిళా జడ్జిలతో కూడిన బెంచ్ ఏర్పడింది. ఆ సమయంలో జస్టిస్ రంజనా దేశాయ్, జస్టిస్ సుధా మిశ్రా కలిసి ఒకే బెంచ్‌లో పనిచేశారు. అలాగే, జస్టిస్ ఎన్వీ రమణ ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న సమయంలోనే తొలిసారి సుప్రీంకోర్టులో ఒకేసారి ముగ్గురు మహిళా జడ్జిలు పనిచేశారు. ఆ ముగ్గురు జస్టిస్ హిమా కోహ్లి, జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ బేలా త్రివేది. వీరు 2021 ఆగస్టు 31న ప్రమాణస్వీకారం చేశారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి ఇప్పటి వరకు నేరుగా తొమ్మిది మంది సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ప్రమాణస్వీకారం చేశారు. వారిలో ఒక్క మహిళా జడ్జిగా 2018లో జస్టిస్ ఇందు మల్హోత్రా నియమితులయ్యారు. ఇప్పటి వరకు 51 మంది సీజేఐలు బాధ్యతలు స్వీకరించగా, అందులో ఒక్క మహిళా న్యాయమూర్తి కూడా లేరు. అయితే, 2027లో జస్టిస్ బీవీ నాగరత్నకు సీజేఐగా అవకాశం లభించనుంది. ఆమె 36 రోజుల పాటు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా భారత చరిత్రలో తొలి మహిళా సీజేఐగా నిలవనున్నారు.

### హైకోర్టులలో మహిళల ప్రస్థానం

దేశ హైకోర్టుల చరిత్రలో మహిళల ప్రాధాన్యం చాలా నెమ్మదిగా పెరిగింది. 1937లో జస్టిస్ అన్నా చాందీ దేశంలోనే తొలి మహిళా న్యాయమూర్తిగా కేరళ జిల్లా కోర్టులో బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత 1991లో జస్టిస్ లీలా సేథ్ హిమాచల్ ప్రదేశ్ హైకోర్టుకు సీజేగా నియమితులై, తొలి మహిళా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా చరిత్ర సృష్టించారు. ప్రస్తుతం సిక్కిం, మణిపూర్, హిమాచల్ ప్రదేశ్, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, బిహార్ హైకోర్టుల్లో ఒక్కొక్కరు మాత్రమే మహిళా జడ్జిలుగా ఉన్నారు. మరోవైపు, ఉత్తరాఖండ్, త్రిపుర, మేఘాలయ హైకోర్టుల్లో అయితే ఇప్పటి వరకు ఒక్క మహిళా జడ్జి కూడా నియమితుల కాలేదు. అంతేకాకుండా, మధ్యప్రదేశ్, బిహార్, ఛత్తీస్‌గఢ్, గువాహటి, సిక్కిం, మణిపూర్ హైకోర్టులలో ఇప్పటి వరకు బార్ కౌన్సిల్ నుంచి నేరుగా ఏ మహిళా న్యాయమూర్తి నియమితులు కాలేదు.

# హైకోర్టు కంటే సుప్రీంకోర్టు ఎక్కువ కాదు, తక్కువ కాదు

## ఇవి రెండూ రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలు సీజేఐ బీఆర్ గవాయ్ స్పష్టీకరణ



మన రాజ్యాంగం ప్రకారం, హైకోర్టు కంటే సుప్రీంకోర్టు ఉన్నతమైనది కాదు, అలా అని తక్కువ కూడా కాదని సీజేఐ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. కనుక ఒక న్యాయమూర్తి పదవికి, నిర్దిష్ట వ్యక్తి పేరు సిఫార్సు చేయమని హైకోర్టు కొలీజియంను, సుప్రీంకోర్టు కొలీజియం ఆదేశించలేదని ఆయన స్పష్టం చేశారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) నిర్వహించిన కార్యక్రమంలో జస్టిస్ గవాయ్ పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఎస్‌సీబీఏ అధ్యక్షుడు వికాస్ సింగ్ ఒక కీలక ప్రతిపాదన చేశారు. సుప్రీంకోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాదులను, హైకోర్టు న్యాయమూర్తుల పదవి కోసం పరిగణించాలని విజ్ఞప్తి చేశారు. నిజానికి సదరు న్యాయవాదులు హైకోర్టుల్లో ప్రాక్టీస్ చేయకపోయినప్పటికీ, వారిని న్యాయమూర్తుల పదవికి పరిగణించాలని కోరారు. దీనిపై స్పందించిన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, "ఫలానా వ్యక్తి పేరును న్యాయమూర్తి పదవికి సిఫార్స్ చేయమని హైకోర్టు కొలీజియంను సుప్రీంకోర్టు కొలీజియం ఆదేశించలేదు. ఎందుకంటే, రాజ్యాంగం ప్రకారం, సుప్రీంకోర్టు- హైకోర్టు కంటే ఉన్నతమైన న్యాయస్థానం కాదు. అలా అని తక్కువ కూడా కాదు. అందువల్ల న్యాయమూర్తుల నియామకంపై హైకోర్టు కొలీజియమే మొదటగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. వారు సిఫార్సు చేసిన పేర్లనే మేము పరిగణిస్తాం. అందులో సరైన అర్హత కలిగిన వారి పేర్లను

సూచించమని చెబుతాం. వారు అన్నీ పరిశీలించి న్యాయమూర్తి పదవికి అర్హులైన వారి పేర్లను సుప్రీంకోర్టుకు పంపుతారు. మాజీ ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా , తన హయాంలో సుప్రీంకోర్టు కొలీజియం అభ్యర్థులతో నేరుగా సంభాషించే పద్ధతిని ప్రారంభించారు. అది నిజంగా చాలా మంచి ఫలితాలను ఇచ్చింది. 10-15 నిమిషాలు లేదా అరగంట పాటు అభ్యర్థులతో సంభాషించిన తరువాత, వారిలో న్యాయమూర్తి పదవికి ఎవరు అర్హులో తెలుసుకోవడానికి, వారు సమాజానికి ఎంతమేరకు తోడ్పడతారో అంచనా వేయడానికి వీలవుతుంది" అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 1855 నాటి ఝార్ఖండ్‌లోని సంతాల్ (హుల్) తిరుగుబాటు నుంచి మహారాష్ట్రలోని జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే వరకు స్వాతంత్ర్య సమరయోధుల పోరాటాన్ని సీజేఐ గుర్తు చేసుకున్నారు. మహాత్మాగాంధీ, రవీంద్రనాథ్ ఠాగూర్, బీఆర్ అంబేద్కర్, మౌలానా అబుల్ కలాం ఆజాద్ మాటలను ఉటంకించారు. స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటంలో న్యాయవాదులు కీలక పాత్ర పోషించారని తెలిపారు. మన ప్రజాస్వామ్య సమాజానికి పునాదిగా ఉండే స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం ఆదర్శాలను ప్రోత్సహించడం, రక్షించడం న్యాయవాదులు, న్యాయమూర్తుల బాధ్యత అని సీజేఐ గవాయ్ అన్నారు.

*"ఫలానా వ్యక్తి పేరును న్యాయమూర్తి పదవికి సిఫార్స్ చేయమని హైకోర్టు కొలీజియంను సుప్రీంకోర్టు కొలీజియం ఆదేశించలేదు. ఎందుకంటే, రాజ్యాంగం ప్రకారం, సుప్రీంకోర్టు- హైకోర్టు కంటే ఉన్నతమైన న్యాయస్థానం కాదు. అలా అని తక్కువ కూడా కాదు. అందువల్ల న్యాయమూర్తుల నియామకంపై హైకోర్టు కొలీజియమే మొదటగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. వారు సిఫార్సు చేసిన పేర్లనే మేము పరిగణిస్తాం. అందులో సరైన అర్హత కలిగిన వారి పేర్లను సూచించమని చెబుతాం. వారు అన్నీ పరిశీలించి న్యాయమూర్తి పదవికి అర్హులైన వారి పేర్లను సుప్రీంకోర్టుకు పంపుతారు. మాజీ ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, తన హయాంలో సుప్రీంకోర్టు కొలీజియం అభ్యర్థులతో నేరుగా సంభాషించే పద్ధతిని ప్రారంభించారు. అది నిజంగా చాలా మంచి ఫలితాలను ఇచ్చింది. 10-15 నిమిషాలు లేదా అరగంట పాటు అభ్యర్థులతో సంభాషించిన తరువాత, వారిలో న్యాయమూర్తి పదవికి ఎవరు అర్హులో తెలుసుకోవడానికి, వారు సమాజానికి ఎంతమేరకు తోడ్పడతారో అంచనా వేయడానికి వీలవుతుంది"*

**- సీజేఐ బీఆర్ గవాయ్**

# దేశంలోనే తొలిసారిగా సుప్రీంకోర్టులో పంచాయతీ ఎన్నికల ఓట్ల లెక్కింపు

## ఓడిపోయిన అభ్యర్థి గెలిచారు.. ప్రమాణ స్వీకారం చేయించాలని ఆదేశం

సర్పంచ్ ఎన్నికల్లో ఓటమి పాలైనా వెనక్కి తగ్గలేదు. తనకే విజయం దక్కుతుందనే నమ్మకంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానంలోనే ఈవీఎంలను తెరిచి కోర్టు లెక్కింపు చేపట్టగా, 51 ఓట్ల తేడాతో విజయం సాధించారు. మూడేళ్ల తర్వాత అనుకూలంగా తీర్పు సాధించారు. ఇప్పుడు ప్రమాణ స్వీకారం చేశారు. అక్కడి రెండో రోజే స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేశారు సర్పంచ్ మోహిత్. హరియాణాలోని పానిపట్ జిల్లాలో జరిగిందీ సంఘటన. జిల్లాలోని బువానా లఖు గ్రామంలో సర్పంచ్ పదవిపై ఎప్పటి నుంచో వివాదం ఉంది. మూడేళ్ల క్రితం 2022 నవంబర్ 2వ తేదీన సర్పంచ్ ఎన్నికలు జరగాయి. ఆ సమయంలో అభ్యర్థి మోహిత్ మాలిక్ విజయం సాధిస్తారని అంతా అనుకున్నారు. కానీ కౌంటింగ్ జరగ్గా, మరో అభ్యర్థి కుల్దీప్ గెలిచారు. అయితే ఓట్ల లెక్కింపులో ఏదో పొరపాటు జరిగిందని అప్పుడే మోహిత్ అనుమానించారు. వెంటనే అధికారులతో వాదించినా, లాభం లేకుండా పోయింది. బూత్ నంబర్ 69లో ఫలితాన్ని పొరపాటుగా మార్చారని మోహిత్ అన్నారు. జిల్లా కోర్టులో పిటిషన్ వేయగా, ఎలాంటి పురగోతి లేదు. దీంతో సుప్రీంకోర్టును కొన్నాళ్ల క్రితం ఆశ్రయించారు. ఇప్పుడు అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. కోర్టుకు ఈవీఎంలను తెప్పించింది. ఓట్లను మళ్లీ లెక్కించింది. అప్పుడు మోహిత్ మాలిక్ 51 ఓట్ల తేడాతో విజయం సాధించినట్లు ప్రకటించింది. అంతేకాదు జిల్లా యంత్రాంగం రెండు రోజుల్లోపు మోహిత్‌తో సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేయించాలని ఆదేశించింది. దీంతో అధికారులు మోహిత్ మాలిక్‌తో ప్రమాణం చేయించారు. తద్వారా ఆయన సర్పంచ్ అయ్యారు. మూడేళ్ల తర్వాత సుప్రీంకోర్టు తీర్పుతో ఆయన అనుకున్నది సాధించారు. అయితే సుప్రీంకోర్టులో ఈవీఎంలను తెరిచి, ఓట్లను మళ్లీ లెక్కించడం దేశంలోనే తొలిసారి.


దాదాపు 3 సంవత్సరాల తర్వాత, ఆగస్టు 11న కోర్టు మోహిత్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఆగస్టు 13న రాష్ట్ర ఎన్నికల సంఘం ద్వారా పరిపాలన సర్పంచ్‌గా మారడానికి నోటిఫికేషన్ జారీ చేయింది. వెంటనే ప్రమాణ స్వీకారం చేశారు. ఇప్పుడు ఆగస్టు 15న సర్పంచ్‌గా జెండాను ఎగురవేశారు. సుప్రీంకోర్టుకు ధన్యవాదాలు తెలిపారు.

# కామెడీ పేరుతో ఎగతాళి చేస్తారా?

### మీ షోలోనే వారికి క్షమాపణలు చెప్పాలి

### దివ్యాంగులపై జోకులు వేయడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం

### సామాజిక మాధ్యమాల్లో ఎగతాళిని నిరోధించాలని కేంద్రానికి సూచన



హాస్యం అవధులు దాటుతోంది.. విచక్షణ కనుమరుగవుతోంది. దివ్యాంగులు, అరుదైన జన్యువ్యాధులతో బాధపడుతున్నవారిని సైతం ఎగతాళి చేస్తూ స్టాండప్ కామెడీ షోలు చేయడం పరిపాటిగా మారింది. అయితే ఇలాంటి షోలపై దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఐదుగురు సామాజిక మాధ్యమ ఇన్‌ఫ్లుయెన్సర్లు క్షమాపణ చెప్పాలని ఆదేశించింది. స్టాండప్ కామెడీ పేరుతో దివ్యాంగులను లక్ష్యంగా చేసుకోవడం తగదని ఆగ్రహం వ్యక్తంచేసింది. సమయ్ రైనా సహా ఐదుగురు కమెడియన్లు తమ పాడ్‌కాస్ట్ లేదా కామెడీ షోలో క్షమాపణ చెప్పాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం స్పష్టంచేసింది. సమయ్ రైనా, విపున్ గోయల్ తదితర కమెడియన్లు దివ్యాంగుల మనసు బాధించేలా జోకులు వేశారని ఎస్ఎంఏ క్యూర్ ఫౌండేషన్ సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌పై విచారణ జరిగింది. ఇండియాస్ గాట్ లాటెంట్ షోలో యూట్యూబర్ రణ్‌వీర్ అల్హాబాదియా చేసిన వ్యాఖ్యలపై దాఖలైన పిటిషన్లతో పాటు ఈ పిటిషన్‌ను ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా రైనా దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్‌ను సుప్రీం తప్పుబట్టింది. రైనా తనను తాను అమాయకుడిగా చిత్రీకరించుకొని తర్వాత క్షమాపణలు చెప్పారని విమర్శించింది. సోనాలి థక్కర్ బేషరతుగా తన షోలో చేసిన క్షమాపణ ఇప్పటికే

ప్రసారమైందున ఆమె తప్ప మిగిలిన ఐదుగురు తమ షో లేదా పాడ్‌కాస్ట్‌లో క్షమాపణ చెప్పాలని ఆదేశించింది. ఈ ఒక్క కేసుకే పరిమితం కాకుండా భవిష్యత్తు సవాళ్లను దృష్టిలో ఉంచుకొని సామాజిక మాధ్యమాల్లో ఇలాంటి ఎగతాళిని నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం నిబంధనలు రూపొందించాలని ఆదేశించింది. 'మేం బేషరతుగా క్షమాపణలు చెప్పాం. గత ఆదేశాలకు అనుగుణంగా ప్రతివాదులంతా హాజరయ్యారు' అని రైనా తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఈ రోజు దివ్యాంగులు, తర్వాత మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఇలా అందరినీ ఎగతాళి చేస్తూ పోతే ఇదంతా ఎక్కడ ఆగుతుందని ధర్మాసనం అసహనం వ్యక్తంచేసింది. ఇలాంటి వ్యవహారశైలిపై జరిమానా విధించే అంశాన్ని తదుపరివిచారణలో పరిశీలిస్తామని తెలిపింది. అలాగే వారి యూట్యూబ్ ఛానళ్లలో కూడా క్షమాపణలు తెలియజేయాలని ఆదేశించింది. కాగా, 'ఇండియాస్ గాట్ లాటెంట్' షోలో పాల్గొన్న ఓ వ్యక్తిని తల్లిదండ్రుల గురించి, శృంగారం పైన ప్రశ్నించడం వల్ల ప్రముఖ యూట్యూబర్ రణ్‌వీర్ అల్హాబాదియాపై తీవ్ర నిరసనలు వెల్లువెత్తాయి. అతడి వ్యాఖ్యలపై పలువురు పార్లమెంటు సభ్యులు కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సమయ్ రైనా షోలో రణ్‌వీర్ ఈ వ్యాఖ్యలు చేశాడు. అలహాబాదియా చేసిన అసభ్యకర వ్యాఖ్యల వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించిన ముంబయి సైబర్ డిపార్ట్‌మెంట్ ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసింది. ఈ షోలో పాల్గొన్న వారు అసభ్య పదజాలాన్ని వాడినట్లు దర్యాప్తులో గుర్తించింది. వీరిలో న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన వారితోపాటు గెస్టులు కూడా ఉన్నట్లు తెలిపింది. వీరికి సమన్లు జారీ చేయడంతోపాటు కామెడీ షోలో మొత్తం 18 ఎపిసోడ్‌లను తొలగించేందుకు చర్యలు కూడా తీసుకున్నారు. అలహాబాదియా చేసిన వ్యాఖ్యలపై పలుల రాష్ట్రాల్లో పలు రాష్ట్రాల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఈ షోతో సంబంధమున్న సమయ్ రైనా, అపూర్వ ముఖిజ సహా పలువురిపై కూడా ఎఫ్ఐఆర్ నమోదైంది. వాటిపై యూట్యూబర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది.

*ఈ రోజు దివ్యాంగులు, తర్వాత మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఇలా అందరినీ ఎగతాళి చేస్తూ పోతే ఇదంతా ఎక్కడ ఆగుతుందని ధర్మాసనం అసహనం వ్యక్తంచేసింది. ఈ ఒక్క కేసుకే పరిమితం కాకుండా భవిష్యత్తు సవాళ్లను దృష్టిలో ఉంచుకొని సామాజిక మాధ్యమాల్లో ఇలాంటి ఎగతాళిని నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం నిబంధనలు రూపొందించాలని ఆదేశించింది.*

# ఇకనుంచి 'మహిళా పోలీస్' కాదు.. పురుషుడితో సమానంగా 'పోలీస్'

## తొలిసారి తెలంగాణ మహిళా పోలీస్ సదస్సు నిర్వహణ
## మహిళా పోలీసులను 'పోలీస్'గా గుర్తించేందుకు తీర్మానం
## అల్లర్ల నిరోధ సమయాల్లోనూ విధులు నిర్వర్తించేలా శిక్షణ



పోలీస్‌శాఖలో దశల వారీగా అన్ని ర్యాంకుల్లో 'మహిళా పోలీస్' అనే పదాన్ని తొలగించి పురుషులతో సమానంగా 'పోలీస్' గానే పరిగణించాలని తెలంగాణలో తొలిసారి నిర్వహించిన మహిళా పోలీస్ సదస్సులో తీర్మానించారు. మహిళా పోలీసులకు కీలకమైన ట్రాఫిక్ విధులను కేటాయించడంతో పాటు అన్ని శిక్షణ మాడ్యూళ్లలో 10% ప్రాతినిధ్యం పెంచాలని, ప్రతి యూనిట్ లేదా జోన్‌లో మహిళాయేతర పోలీస్ స్టేషన్లలోనూ ఎస్‌హెచ్‌వోలుగా నియమించాలని కోరుతూ తీర్మానాలను ఆమోదించారు. తెలంగాణ పోలీస్‌శాఖలో గత సంవత్సరం నవంబరులో 2,338 మంది మహిళా పోలీసులు చేరారు. అయినప్పటికీ మొత్తం పోలీసులలో 8.6% మంది మాత్రమే మహిళలు ఉన్నారు. ఈ శాతాన్ని పెంచాల్సిన అవసరముందని సదస్సు అభిప్రాయపడింది. గేమ్ ఛేంజర్‌గా ఉన్న 'షీ'

బృందాలు 66,617 పిటిషన్లను పరిశీలించాయి. 6,319 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి వేధింపుల కేసుల్లో 15,343 మందికి కౌన్సెలింగ్ ఇచ్చాయని వక్తలు వెల్లడించారు. షీ టీంలు పనిచేస్తున్న ప్రాంతాల్లో వేధింపుల కేసులు 85% మేర తగ్గాయని పేర్కొన్నారు.

## ఇవీ తీర్మానాలు

మాదకద్రవ్యాలు, అల్లర్ల నిరోధక ఉదంతాల్లోనూ విధులు నిర్వర్తించేలా మహిళా ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లకు శిక్షణ అందించాలి. రాష్ట్ర వ్యాప్తంగా లింగ సున్నితత్వంపై శిక్షణ నిర్వహించాలి. లింగ సమానత్వాన్ని అంచనా వేసేందుకు 1 లేదా 2 సంవత్సరాలకు ఒకసారైనా ఆడిట్ నిర్వహించాలి.

పని ప్రదేశాల్లో వేధింపుల నిరోధక (పోష్) చట్టానికి సంబంధించి అంతర్గత కమిటీల వివరాలను తప్పనిసరిగా ప్రదర్శించాలి. ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ, హెల్ప్‌లైన్, షీ బాక్స్‌లు, జిల్లాల స్థాయిలో వాట్సప్ గ్రూప్‌లు ఏర్పాటు చేయాలి. లైంగిక వేధింపులకు సంబంధించి ఫిర్యాదుల పరిష్కారానికి ప్రధాన కార్యాలయంలోని పర్సనల్ విభాగంలో సెల్ ఏర్పాటు చేయాలి.

గృహనిర్వహణ బాధ్యతల దృష్ట్యా పోలీస్‌శాఖలోని అన్ని సర్వీసుల్లోని మహిళా సిబ్బందికి పని వేళల్లో గంటపాటు మినహాయింపు ఇవ్వాలి. ప్రస్తుతం ఉన్న 90 రోజుల ఛైల్డ్‌కేర్ సెలవుల్ని 18 ఏళ్ల వరకు కాకుండా 21 సంవత్సరాల వరకు వినియోగించుకునే వెసులుబాటు కల్పించాలి.

ప్రతి స్టేషన్‌లో హహిళా అధికారులకు ప్రత్యేక విశ్రాంతి గదులతో పాటు రెండు ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలను కేటాయించాలి. పిల్లలు ఉన్న మహిళా అధికారుల కోసం స్థానిక డేకేర్ సెంటర్‌లతో భాగస్వామ్యాల్ని ఏర్పరచాలి. మొబైల్ విశ్రాంతి గదుల వ్యాన్‌లు సహా అన్ని పని ప్రదేశాల్లో శానిటరీ నాప్‌కిన్ వెండింగ్ యంత్రాలు ఏర్పాటు చేయాలి. ఆత్మరక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్, సాయుధ శిక్షణ ఇవ్వాలి.

40 ఏళ్లు పైబడిన మహిళలకు వార్షిక ఆరోగ్య పరీక్షల్లో మమోగ్రామ్, పాప్‌స్మియర్, బోన్ డెన్సిటీ పరీక్షలు చేయాలి. మహిళా అధికారుల క్షేత్రస్థాయి భద్రత కోసం ప్రామాణిక కార్యాచరణ విధానాలు (ఎస్‌వోపీ) రూపొందించాలి.

తమిళనాడు తరహాలో వస్త్రధారణ, మేకప్, ఉపకరణాలు, నేమ్ ప్లేట్ స్పెసిఫికేషన్‌లతో కూడిన ఏకరీతి నమూనా మార్గదర్శకాలను అమలు చేయాలి. సాయుధ రిజర్వ్, సివిల్ సిబ్బంది కోసం పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆరోగ్యకరమైన క్యాంటీన్‌లను అందుబాటులోకి తీసుకురావాలి. మహిళలకు వారాంతపు సెలవులతో పాటు రాత్రి పూట విధులు నిర్వహిస్తే మరుసటి రోజు సెలవు ఇవ్వాలి.

# అదనపు కట్నం కోసం భర్త దురాగతం

# భార్య సజీవదహనం

## థిన్నర్ చల్లి నిప్పంటించిన భర్త, అత్తమామలు

## ఆసుపత్రిలో బాధితురాలి మృతి.. .. నోయిడాలో దారుణం

## హత్య వీడియో వైరల్.. భర్త విపిన్, అత్త అరెస్టు..

## సీన్ రీకన్‌స్ట్రక్షన్‌లో ఇన్‌స్పెక్టర్ పిస్టల్ లాక్కొన్న విపిన్

## నిందితుడి కాలిపై పోలీసుల కాల్పులు



అదనపు కట్నం అత్యాశకు మరో యువతి బలైపోయింది. భర్త, అత్తమామలు కలిసి ఆమెను అతి కిరాతకంగా హింసించి చంపేశారు. జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్లారు. అంతటితో ఆగకుండా.. థిన్నర్ చల్లి, నిప్పంటించి చంపేశాడు. ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో ఈ దారుణం చోటుచేసుకోగా.. పోలీసులు భర్తను అరెస్టు చేసి, సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేస్తుండగా ఇన్‌స్పెక్టర్ పిస్టల్ లాక్కొని, పారిపోయే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో పోలీసులు జరిపిన కాల్పుల్లో నిందితుడి కాలికి గాయమైంది. నోయిడా అదనపు డీసీపీ సుధీర్‌కుమార్, బాధితురాలి తండ్రి భికారీ సింగ్ పాయ్లా కథనం ప్రకారం.. సిర్సా చౌరాహా ప్రాంతానికి చెందిన సత్యవీర్, దయా దంపతుల కుమారుడు విపిన్ భాటీతో.. భికారీ సింగ్ కుమార్తె నిక్కీని ఇచ్చి ఏడేళ్లక్రితం వివాహం చేశారు. వీరికి ఆరేళ్ల కుమారుడున్నారు. పెళ్లి సమయంలో విపిన్ కోరినట్లు కట్నంతోపాటు ఒక స్కార్పియో వాహనాన్ని ఇచ్చామని భికారీ సింగ్ తెలిపారు. ఆ తర్వాత బుల్లెట్ బైక్ అడిగితే.. కొనిచ్చామని పేర్కొన్నారు. కొంత కాలం క్రితం తమ కుటుంబం కోసం మెర్సిడెస్ కారును కొన్నట్లు

వివరించారు. అప్పటి నుంచి విపిన్ తనకు కూడా ఆ కారును కొనివ్వాలని పట్టుబట్టాడని, రూ.36 లక్షల అదనపు కట్నం ఇవ్వాలంటూ తమపై ఒత్తిడి తీసుకువచ్చాడని చెప్పారు. ఈ క్రమంలో నిక్కీని ఆమె భర్త, అత్తమామలు హింసించారు. అంతటితో ఆగకుండా.. థిన్నర్ చల్లి నిప్పంటించి పారిపోయారని పోలీసులు తెలిపారు. ఇరుగుపొరుగు వారు బాధితురాలిని ఫోర్టిస్ ఆస్పత్రికి తరలించారు. 70% కాలిన గాయాలవ్వడంతో.. సఫ్దార్‌జంగ్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే నిక్కీ చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. నిక్కీపై విపన్, అత్తమామల దాడి దృశ్యాల వీడియో వైరల్ అయ్యింది. పోలీసులు విపిన్, అతని తల్లి దయాను అరెస్టు చేశారు. విపిన్ తండ్రి సత్యవీర్, సోదరుడు రోహిత్ పరారీలో ఉన్నారు. పోలీసులు విపిన్‌తో సీన్ రీకన్‌స్ట్రక్షన్‌లో భాగంగా.. హత్యకు ఉపయోగించిన థిన్నర్ బాటిళ్లను స్వాధీనం చేసుకునేందుకు సిర్సా చౌరాహాకు చేరుకున్నారు. అక్కడ విపిన్ ఓ ఇన్‌స్పెక్టర్ నుంచి పిస్టల్‌ను లాక్కొని, పోలీసుల వైపు గురిపెట్టి.. పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకొని విపిన్ కాలిపై కాల్పులు జరిపారు. అతని కాలికి బుల్లెట్ గాయమైంది. కాగా, ఆస్పత్రి వద్ద విపిన్‌ను మీడియా మాట్లాడించగా.. అతనిలో ఏమాత్రం పశ్చాత్తాపం కనిపించలేదు. "నేను తప్పు చేయలేదు. నా భార్యను చంపలేదు. ఆమె తనకుతానుగా నిప్పంటించుకుంది" అని చెప్పాడు. అదనపు కట్నం కోసమే విపిన్ తన కూతురిని పొట్టనబెట్టుకున్నాడని నిక్కీ తండ్రి భికారీ సింగ్ పాయ్లా ఆరోపించారు. నిక్కీ ఆరేళ్ల కుమారుడు కూడా.. "మా అమ్మపై ఏదో చల్లారు. ఆ తర్వాత లైటర్‌తో నిప్పంటించారు" అని పోలీసులకు వాంగ్మూలమిచ్చాడు.

అదనపు కట్నం కోసం భార్యను చంపిన భర్త ఎన్‌కౌంటర్‌కు గురయ్యాడు. కస్టడీ నుంచి తప్పించుకుని పారిపోతున్న అతడిపై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో అతడి కాలికి గాయాలు అయ్యాయి. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

## తక్షణం నివేదిక సమర్పించండి

### యుపి డిజిపికి జాతీయ మహిళా కమిషన్ ఆదేశం

మరోవైపు ఈ కేసును జాతీయ మహిళా కమిషన్ సుమోటోగా స్వీకరించింది. వివరణాత్మక కార్యచరణ నివేదికను సమర్పించాలని ఉత్తర్‌ప్రదేశ్ పోలీస్ డైరెక్టర్ జనరల్‌కు ఎన్‌సీడబ్ల్యూ చైర్‌పర్సన్ విజయా రహత్కర్ లేఖ రాశారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న వారందరినీ వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలి కుటుంబానికి, సాక్షులకు తగిన భద్రత కల్పించాలని పోలీసులను ఆదేశించింది.

# గర్భిణిని కడతేర్చిన కిరాతక భర్త

## ముక్కలు చేసి మూసీలో పారేసిన పైశాచికత్వం

## 3 విడతలుగా నదిలోకి.. ఇంట్లోనే ఉన్న మొండెం

## హైదరాబాద్ బోడుప్పల్‌లో దారుణం

## ఏడాదిన్నర క్రితం ప్రేమ వివాహం

## పెళ్లయిన మూడు నెలలకే గొడవలు, గృహహింస కేసు



పెద్దలను ఎదిరించి ప్రేమించిన అమ్మాయిని పెళ్లాడిన పక్కింటి కుర్రాడే ఆ యువతి పాలిట కాలయముడయ్యాడు. ఐదు నెలల గర్భిణి అని కూడా చూడకుండా.. కట్టుకున్న భర్తే ఆమెను హతమార్చాడు. ఆపై, చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు నరరూప రాక్షసుడిగా మారిన ఆ భర్త.. భార్య శవాన్ని ముక్కలు ముక్కలు చేసి వాటిని విడతలవారీగా మూసీ నదిలో పారేశాడు. మొండాన్ని మాత్రం ఇంట్లోనే ఉంచి.. నా భార్య కనిపించడం సాయం చెయ్యండంటూ పోలీసుస్టేషన్‌కు వెళ్లిన ఆ కిరాతకుడు.. విచారణలో పోలీసులకు దొరికిపోయాడు. హైదరాబాద్, రాచకొండ కమిషనరేట్, మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బోడుప్పల్‌లో వెలుగుచూసిన ఈ ఘటనలో వికారాబాద్ జిల్లా

కామారెడ్డిగూడకు చెందిన స్వాతి (21) తన భర్త చేతిలో దారుణ హత్యకు గురైంది. వివరాలను మల్కాజిగిరి డీసీపీ పద్మజ విలేకరులకు వెల్లడించారు. డీసీపీ కథనం ప్రకారం.. కామారెడ్డిగూడలో పక్కపక్క ఇళ్లలో ఉండే మహేందర్‌రెడ్డి (27), స్వాతి (21) ప్రేమించుకున్నారు. వేర్వేరు కులాలకు చెందిన వీరి ప్రేమను పెద్దలు అంగీకరించకపోవడంతో ఎవ్వరికీ తెలియకుండా గతేడాది జనవరిలో కూకట్‌పల్లిలోని ఆర్యసమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. అనంతరం స్వగ్రామంలో ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరగ్గా సయోధ్య కుదిర్చిన పెద్దలు.. యాదగిరిగుట్టలో మరోమారు పెళ్లి చేశారు. అనంతరం వీరు బోడుప్పల్‌లోని బాలాజీనగర్‌లో కాపురం పెట్టారు. ఇంటర్ వరకు చదివిన మహేందర్ రెడ్డి ర్యాపిడో డ్రైవర్‌గా పని చేస్తుండగా, డిగ్రీ మధ్యలోనే ఆపేసిన స్వాతి టెలీకాలర్‌గా పని చేస్తోంది. అయితే, పెళ్లయిన నెల రోజులు తర్వాత దంపతుల మధ్య మనస్పర్థలు మొదలయ్యాయి. పెళ్లయిన రెండు నెలలకే స్వాతి గర్భం దాల్చగా వద్దని చెప్పి మహేందర్ రెడ్డి అబార్షన్ చేయించాడు. ఆ తర్వాత భర్త వేధింపులు భరించలేకపోయిన స్వాతి వికారాబాద్ మహిళా పోలీసుస్టేషన్‌లో గృహహింస కేసు పెట్టింది.

గ్రామపెద్దలు దంపతుల మధ్య రాజీ కుదిర్చారు. కానీ, స్వాతిపై కోపం పెట్టుకున్న మహేందర్ రెడ్డి ఆమెను మరింత వేధించడం మొదలుపెట్టాడు. స్వాతి తన తల్లిదండ్రులతో మాట్లాడకుండా, కలవకుండా కట్టడి చేసేవాడు. ఈ గొడవలు కొనసాగుతుండగా

## స్వాతి హత్యపై నివేదిక ఇవ్వండి

### తెలంగాణ డీజీపీకి జాతీయ మహిళా కమిషన్ లేఖ

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఐదు నెలల గర్భిణి స్వాతి హత్య కేసును జాతీయ మహిళా కమిషన్ సుమోటోగా స్వీకరించింది. పథకం ప్రకారం స్వాతిని హత్య చేసిన ఆమె భర్త.. మృతదేహాన్ని ముక్కలు చేసి వాటిని ప్రతాపసింగారం సమీపంలోని మూసీ నదిలో పారేశాడు. అయితే, ఈ కేసు దర్యాప్తు పారదర్శకంగా జరగాలని, కేసుకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన నివేదికను తమకు అందజేయాలని జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయ రహత్‌కర్ తెలంగాణ డీజీపీకి నోటీసు పంపారు. కాగా, ఈ హత్య కేసులో మేడిపల్లి పోలీసులు స్వాతి భర్తను ఇప్పటికే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మరోమారు గర్భం దాల్చిన స్వాతి ఇటీవల స్వగ్రామానికి వెళ్లింది. మహేందర్ రెడ్డి వద్దకు వెళ్లనంటే పెద్దలు సర్దిచెప్పడంతో 20 రోజుల క్రితమే తిరిగి బోడుప్పల్‌కు వచ్చింది. 5 నెలల గర్భిణి అయిన స్వాతి వినాయకచవితికి పుట్టింటికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుంటానని 22వ తేదీన భర్తకు చెప్పింది. ఇందుకు మహేందర్ రెడ్డి ఒప్పకోకపోవడంతో ఆ రోజు రాత్రి ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. మరుసటి రోజు ఆగస్టు 23 ఉదయం 11 గంటల వరకు స్వాతి నిద్ర లేవలేదు. అయితే, భార్యను అడ్డుతొలగించుకోవాలని నిర్ణయించుకున్న మహేందర్.. ఉదయం 11:30 గంటలప్పుడు ఇంటి నుంచి బయటకు వెళ్లి సాయంత్రం నాలుగు గంటలకు తిరిగొచ్చాడు. వచ్చేటప్పుడు ఓ ఎక్సా బ్లేడు కొనుగోలు చేసి తెచ్చి ఇంట్లో దాచిపెట్టాడు. వెంటనే పథకం ప్రకారం భార్యతో గొడవ ప్రారంభించి ఆమె గొంతునులిమి చంపేశాడు. అనంతరం భార్య మృతదేహాన్ని మంచంపై పడేసి ఎక్సా బ్లేడుతో ముక్కలు చేశాడు. తల, కాళ్లు, చేతులను మొండెం నుంచి వేరు చేసి ప్లాస్టిక్ కవర్లలో కుక్కి మూటగట్టాడు. మొండెంను మాత్రం ప్లాస్టిక్ కవర్‌లతో కప్పి ఒక దిండులా ప్యాక్ చేసి పక్కన పెట్టాడు. పరుపును మడిచి మూటగట్టి ఓ మూల పెట్టాడు. రాత్రి ఏడు గంటల తర్వాత ఒక్కో మూటను బ్యాక్‌ప్యాక్‌లో పెట్టుకుని ద్విచక్రవాహనంపై వెళ్లి ప్రతాపసింగారం ప్రాంతంలోని మూసీ నదిలో పారేశాడు.

హత్యా నేరం నుంచి తప్పించుకునేందుకు మహేందర్ రెడ్డి మరో నాటకానికి తెర తీశాడు. మేము బానే ఉన్నాం, ఇప్పుడే భోజనం చేశామంటూ రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో స్వాతి ఫోన్ నుంచి ఆమె తల్లిదండ్రులకు మెసేజ్ పెట్టాడు. అలాగే, తన చెల్లికి ఫోన్ చేసి స్వాతి కనిపించడం లేదంటూ నమ్మబలికాడు. ఆ మాటలను నమ్మిని ఆమె.. వెంటనే తన భర్తను మహేందర్ రెడ్డి వద్దకు పంపింది. బావ వచ్చే లోపు కాళ్లు, చేతులు, తలను మహేందర్ రెడ్డి మూసీలో పడేశాడు. మహేందర్‌రెడ్డిని కలిసిన అతని బావ ఏం జరిగిదంటూ వాకబు చేశాడు. హత్య సంగతి దాచిపెట్టి భార్య కనిపించడం లేదని మహేందర్ రెడ్డి అతని వద్ద వాపోయాడు. దీంతో మిస్సింగ్ కేసు పెడదామని చెప్పి మహేందర్ రెడ్డిని అతని బావ రాత్రి 11 గంటల ప్రాంతంలో ఉప్పల్ పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లాడు. మహేందర్ రెడ్డి నివాసమున్న ప్రాంతం మేడిపల్లి పోలీసుస్టేషన్ పరిధిలోకి వస్తుందంటే రాత్రి 12 గంటలకు అక్కడికి చేరుకున్నారు. అయితే, కేసు నమోదులో భాగంగా ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి వేసిన ప్రశ్నలకు మహేందర్ రెడ్డి పొంతన లేని సమాధానాలు ఇవ్వగా.. ఇన్‌స్పెక్టర్ గట్టిగా ప్రశ్నించడంతో చేసిన దారుణాన్ని బయటపెట్టాడు. వెంటనే మహేందర్ రెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వైద్య పరీక్షల అనంతరం మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించారు.

# క్రికెట్ బ్యాట్ కోసం బాలికను చంపిన బాలుడు

## యూట్యూబ్‌లో చూసి క్రైమ్ స్కెచ్

## పోలీసులనూ తప్పుదోవ పట్టించిన వైనం

అభం శుభం ఎరగని పదకొండేళ్ల చిన్నారి సహస్రను అతి కిరాతకంగా చంపింది పక్కింటి బాలుడేనని పోలీసుల దర్యాప్తులో తేలడం సంచలనం రేపింది. సహస్ర ఇంట్లో దొంగతనం, మర్డర్ కోసం బాలుడు రెండ్రోజులు ముందుగానే ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. యూట్యూబ్‌లో చూసే క్రైమ్ సీన్స్, సినిమాల స్ఫూర్తితో స్కెచ్ వేసుకుని.. ఆ ప్రకారమే సహస్రను హత్య చేశాడని హైదరాబాద్ బాలానగర్ డీసీపీ ప్రకటించారు. క్రికెట్ కిట్ కోసమే బాలుడు ఈ హత్యకు పాల్పడటం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

సహస్ర హత్య అనంతరం అనుమానంతో బాలుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వయసు 15 ఏళ్లే అయినప్పటికీ.. విచారణలో మాత్రం అతడు క్రిమినల్ ఇంటెలిజెంట్‌లా వ్యవహరించి పోలీసులను తప్పుదోవ పట్టించాడని బాలానగర్ డీసీపీ వెల్లడించారు. ఆధారాల్లేకుండా హత్యచేసి పోలీసులను ముప్పుతిప్పలు పెట్టిన బాలుడు.. చివరికి ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సమాచారంతో అడ్డంగా దొరికిపోయాడు. సీసీటీవీ పుటేజీల ఆధారంగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను విచారించగా.. హత్య జరిగిన రోజున ఓ బాలుడు గోడదూకి అపార్ట్‌మెంట్‌లోకి రావడాన్ని గమనించినట్లు వాంగ్మూలం ఇచ్చాడు. ఈ దిశలో పోలీసులు దర్యాప్తు చేయగా బాలుడే హంతకుడనే స్పష్టమైంది. అనంతరం జరిగిన విచారణలో బాలుడు సహస్రను హత్య చేసినట్లు అంగీకరించాడు. క్రికెట్ బ్యాట్ కొనుక్కోవాలని బాలిక ఇంటికి చోరీ కోసం వెళ్లానని.. తర్వాత కత్తితో ఆమెను హత్య చేసి ఇంటికొచ్చి కత్తిని శుభ్రంగా కడిగానని ఒప్పుకున్నాడు. టీషర్ట్‌కు రక్తపు మరకలు అంటడంతో వాషింగ్ మెషీన్లో వేశానని చెప్పాడు. క్రైమ్ మూవీస్ చూసే అలవాటు ఉందని.. దొంగతనం చేయడం, తప్పించుకోవడంపై ఆన్‌లైన్‌లో సెర్చ్ చేశానని వెల్లడించాడు. చోరీకి రెండు రోజుల ముందే బాలుడు ప్లాన్ వేసుకున్నాడు. అలాగే, చోరీలు, హత్యల గురించి బాలుడు రాసుకున్న పుస్తకాన్ని, హత్యకు ఉపయోగించిన కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ప్రస్తుతం బాలుడిని జువైనల్ హోంకు తరలించారు.

కూకట్‌పల్లిలోని సహస్ర తల్లిదండ్రుల్ని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య పరామర్శించారు. పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలుడిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేస్తామని తెలిపారు. సీఎంతో మాట్లాడి బాలిక కుటుంబ సభ్యులను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కేసులో పోలీసుల దర్యాప్తుపై పూర్తి నమ్మకం ఉందని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య అన్నారు. ఇలాఉండగా, హైదరాబాద్ కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ దగ్గర సహస్ర పేరెంట్స్, బంధువులు బైఠాయించి అసలైన దోషులను తప్పించారంటూ ఆరోపించారు. నిందితుడికి ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేశారు. సహస్ర తండ్రి కృష్ణ సంచలన ఆరోపణలు చేశారు. 'క్రికెట్ బ్యాట్ కోసం కాదు, ఇంట్లోని డబ్బు కోసమే బాలుడు వచ్చాడు. సహస్ర హత్య వెనుక బాలుడి తల్లిదండ్రుల ప్రమేయం ఉంది. న్యాయం జరగకపోతే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటాం. కేసును పోలీసులు తప్పుదోవ పట్టిస్తున్నట్టు అనుమానం ఉంది. పోలీసులు మరోసారి దర్యాప్తు చేయాలి' అని సహస్ర తండ్రి కృష్ణ డిమాండ్ చేశారు.



# జాతీయ ఉత్తమ ఉపాధ్యాయినిగా మారం పవిత్ర

తెలంగాణ



విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి ఉత్తమ విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం.. ప్రతి ఏటా ప్రకటించే జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు తెలుగు రాష్ట్రాలనుంచి ఇద్దరు ఉపాధ్యాయినులు ఎంపికయ్యారు. సూర్యాపేట జిల్లాకు చెందిన మారం పవిత్ర, విశాఖపట్టణానికి చెందిన తిరుమల శ్రీదేవి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికయ్యారు. ఈ అవార్డును సెప్టెంబర్ 5న ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి చేతుల మీదుగా అందజేస్తారు.

తెలంగాణ రాష్ట్రం నుండి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు-2025కు ఒక్కరే ఎంపిక కావడం విశేషం. మారం పవిత్ర ప్రస్తుతం సూర్యాపేట జిల్లా పెన్ పహాడ్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ టీచర్‌గా పనిచేస్తున్నారు. 2023 లోనూ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్నారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా గుర్తింపు రావడంపై మారం పవిత్ర సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఏకైక కేంద్ర ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపిక కావడం చాలా గర్వంగా ఉందని ఆమె తెలిపారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు-2025కు 150 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోగా తెలంగాణ రాష్ట్ర మొత్తం మీద ఈమె ఒక్కరే ఎంపిక కావడం గమనార్హం. కేంద్ర విద్యాశాఖ ఈ అవార్డులను సోమవారం ప్రకటించింది. దేశ వ్యాప్తంగా మొత్తం 45 మంది ఉపాధ్యాయులను కేంద్రం ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. మారం పవిత్ర 2023లోనూ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్నారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా గుర్తింపు పట్ల జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా విద్యాశాఖ అధికారులు, తోటి ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

# జాతీయ ఉత్తమ ఉపాధ్యాయినిగా తిరుమల శ్రీదేవి

ఆంధ్రప్రదేశ్



ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం జిల్లాకు చెందిన ఉపాధ్యాయురాలు మాదాబత్తుల తిరుమల శ్రీదేవి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా పలువురు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. అందులో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంకు చెందిన తిరుమల శ్రీదేవి కూడా ఉన్నారు. అయితే స్కూల్ అసిస్టెంట్‌గా ఉపాధ్యాయ వృత్తిని ప్రారంభించిన శ్రీదేవి... ప్రస్తుతం ప్రధానోపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. తిరుమల శ్రీదేవి 2001లో స్కూల్ అసిస్టెంట్ (హైస్కూల్ టీచర్)గా ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించారు. ఆమె జీవశాస్త్రంలో బోధన కొనసాగిస్తున్నారు. గతంలో విశాఖపట్నంలోని ఎంవీడీఎం, కేడీపీఎంఉన్నత పాఠశాలల్లో పనిచేశారు. ఆమె 2021లో ప్రధానోపాధ్యాయురాలిగా పదోన్నతి పొందారు. తిరుమల శ్రీదేవి... జిల్లా, రాష్ట్ర స్థాయిలలో కూడా ఉత్తమ ఉపాధ్యాయినిగా అవార్డులను పొందారు. ఆర్ట్ ఇంటిగ్రేటెడ్ టీచింగ్, లెర్నింగ్ విధానంలో విద్యార్థులకు బోధన ప్రారంభించారు. జిటల్ బోర్డు వినియోగంతోపాటు ఆయా పాఠ్యాంశాలను ప్రాక్టికల్‌గా వివరిస్తూ విద్యార్థులకు చక్కగా అర్థమయ్యేలా చేస్తున్నారు. అలాగే విద్యార్థులను క్షేత్రస్థాయి పర్యటనలకు తీసుకువెళ్లి ప్రాజెక్టులు చేయిస్తుంటారు. ఇది ఆమెకు దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిపెట్టింది. అలాగే ఆమె సింగిల్-యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై అనేక అవగాహన కార్యక్రమాలను కూడా నిర్వహించారు.

ప్రస్తుతం తిరుమల శ్రీదేవి... విశాఖపట్నం జిల్లా భీమునిపట్నంలోని పండిట్ నెహ్రూ జీవీఎంసీ మునిసిపల్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. “కమ్ టు లెర్న్-గో టు సర్వ్ ద నేషన్”(చదువుకునేందుకు రండి-దేశ సేవకు వెళ్లండి) థీమ్‌తో సరికొత్త విధానాన్ని శ్రీదేవి రూపొందించారు. ఇక, గత ఏడాది రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయినిగా శ్రీదేవిని ఎంపిక చేసింది.

# భళా సుష్మిత!

## గ్రామాభివృద్ధి కోసం బాలిక ఒంటరి పోరాటం

## గ్రామ పంచాయతీ ముందు ప్లకార్డులతో రోడ్డుపై నిరసన

## తాగునీరు, మురుగునీటి మరమ్మతుల కోసం డిమాండ్

## దిగొచ్చిన అధికారులు.. పనులు ప్రారంభం




ఆరో తరగతి చదివే విద్యార్థి గ్రామంలో జరిగే అన్యాయాలు, అక్రమాలపై యుద్ధం చేసింది. తన గ్రామ అభివృద్ధి కోసం గళం విప్పిన ఆమె, ఏకంగా గ్రామ పంచాయతి గేటు ముందు ప్లకార్డులతో కూర్చొని ఒంటరి పోరాటం చేసింది. సరైన సౌకర్యాలు లేవని డిమాండ్ చేస్తూ నిరసనకు దిగింది. కర్ణాటకలోని దావణగెరె జిల్లా ఆలూరు గ్రామానికి చెందిన సుష్మిత అదే గ్రామంలో దేవరాజ్ అరసు ప్రాథమిక పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి తానే స్వయంగా చొరవ తీసుకుంది. గ్రామ పంచాయతీ ముందు బైఠాయించి, పక్కన కుర్చీకి ప్లకార్డులు కట్టి నిరసనకు దిగింది. ఆమె రోజూ పాఠశాలకు వెళ్లే మార్గం పూర్తిగా గుంతలతో నిండి ఉండడం, వర్షం కురిస్తే మురుగు నీరంతా రోడ్డుపైకి చేరడం ఆమెలో ఆవేశాన్ని రగిల్చింది. అంతే కాకుండా రోడ్లపై నీరు చేరడంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని సుష్మిత తెలిపింది. వర్షాలతో రోడ్లపై నీరు చేరి స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, కొన్ని సందర్భాల్లో ఉపాధ్యాయులు బురదలో పడిపోయిన ఘటనలు ఉన్నాయని చెప్పింది. అందుకే తాను నిరసనకు దిగినట్లు తెలిపింది. అంతే కాకుండా గ్రామంలో స్వచ్ఛమైన తాగునీటి కేంద్రాలు లేకపోవడంతో స్థానిక ప్రజలు అవస్థలు పడేవారు. ఇది గమనించిన సుష్మిత వెంటనే నీటి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. అలాగే మురుగు నీటి వ్యవస్థ సరిగ్గా లేదని, వరద నీటిలో ద్రవ పదార్థాలు రోడ్డుపై ప్రవహించేవని ఆమె చెప్పింది. అధికారులు వెంటనే మురుగు

కాలువలకు మరమ్మత్తులు చేయించాలని ఆ విద్యార్థి డిమాండ్ చేసింది. విద్యార్థి నిరసన గురించి తెలుసుకున్న గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సుష్మితతో చర్చలు జరిపి ఆమె డిమాండ్లను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆ విద్యార్థి తన నిరసనను విరమించుకుంది. గ్రామంలో ప్రాథమిక సౌకర్యాలు లేవని, తన నిరసన తర్వాత కాలువల నుంచి బురదను తొలగించడం ప్రారంభించారని తెలిపింది. అలాగే పాఠశాలకు వెళ్లే రహదారికి మరమ్మత్తులు చేయడం కోసం టెండర్లను పిలిపించారని పేర్కొంది. గ్రామంలో సరైన స్థలం లేకపోవడంతో స్వచ్ఛమైన తాగునీటి యూనిట్‌ను వేరే గ్రామానికి మార్చారు. గ్రామంలో మంచి నీటి యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఒకవేళ డిమాండ్లు నెరవేరకపోతే తాను మళ్లీ నిరసనకు దిగుతానని సుష్మిత పేర్కొంది.

# సీఐఎస్ఎఫ్ చరిత్రలో తొలిసారి మహిళా కమాండో టీమ్..

సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) కీలక నిర్ణయం తీసుకుంది. చరిత్రలో ముందెన్నడూ లేని విధంగా మహిళా కామాండోలను రంగంలోకి దించనుంది. అన్ని రకాల ట్రైనింగ్ పూర్తయిన తర్వాతే వారిని విధుల్లో ఉంచనుంది. ఎయిర్‌పోర్టులు, ఇతర సున్నిత ప్రదేశాల్లో వారిని విధుల్లో పెట్టనుంది. ప్రస్తుతం మహిళా కమాండోలకు సంబంధించి మధ్య ప్రదేశ్, బార్వాహాలోని రీజనల్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ ఇస్తున్నారు. దాదాపు 8 వారాల పాటు వారికి ట్రైనింగ్ ఇవ్వనున్నారు. తర్వాత వారిని క్విక్ రియాక్షన్ టీమ్స్, స్పెషల్ టాస్క్ ఫోర్స్‌లతో హై సెక్యూరిటీ ప్రదేశాలతో పాటు ఇతర కార్యాలయాల దగ్గర విధుల్లో పెట్టనున్నారు.

మొదటి బ్యాచ్‌లో భాగంగా 30 మంది మహిళలకు ట్రైనింగ్ ఇస్తున్నారు. ఆగస్టు 11వ తేదీన ట్రైనింగ్ మొదలైంది. అక్టోబర్ 4వ తేదీ వరకు ట్రైనింగ్ కొనసాగుతుంది. రెండో బ్యాచ్ అక్టోబర్ 6వ తేదీనుంచి మొదలవుతుంది. నవంబర్ 29వ తేదీ వరకు కొనసాగుతుంది. సీఐఎస్ఎఫ్ మొత్తం 100 మంది మహిళలకు ట్రైనింగ్ ఇచ్చి విధుల్లో ఉంచనుంది. ట్రైనింగ్ కార్యక్రమంలో భాగంగా ఫిజికల్ ఫిట్‌నెస్, ఆయుధాల శిక్షణ, ఒత్తిడిలో లైవ్-ఫైర్ డ్రిల్స్, రన్నింగ్, అబ్‌స్టాకిల్ కోర్సులు, రాపెల్లింగ్, అడవుల్లో ఎలా బతకాలన్న దానిపై ట్రైనింగ్ ఉంటుంది. 48 గంటల కాన్ఫిడెన్స్ బిల్డింగ్ ఎక్సర్‌సైజ్ కూడా ఉంటుంది.

# గిరిజన యువతి అరుదైన ఘనత

## మొదటి ప్రయత్నంలోనే నీట్‌లో క్వాలిఫై అయిన రస్పెద

## దిదాయి గిరిజన తెగలో తొలి బాలికగా రికార్డ్



ఆత్మవిశ్వాసం, పట్టుదల ముందు ఎంతటి పరీక్ష అయినా తలొగ్గాల్సిందే. నాగరికతకు దూరంగా ఉన్నా, సౌకర్యాలు అంతంతమాత్రమే అయినా ఓ గిరిజన యువతి సాధించిన విజయం ఆషామాషీ కాదు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించింది ఒడిశా మల్కాన్‌గిరి జిల్లాకు చెందిన ఓ గిరిజన యువతి. మల్కాన్‌గిరి జిల్లాలోని అమ్లిగూడ గ్రామానికి రోడ్డు, వైద్యం తదితర వసతులు లేవు. అయితేనేం, దిదాయి గిరిజన తెగకు చెందిన చంపా రస్పెద అనే యువతి ప్రతికూల పరిస్థితులన్నింటిని దాటుకుని మొదటి ప్రయత్నంలోనే నీట్ పరీక్షను క్లియర్ చేసింది. డాక్టర్ అయి తన సమాజంలోని ప్రజలకు సేవచేయాలని ఆశపడుతోంది. నీట్ పాసైన మొట్టమొదటి దిదాయి తెగకు చెందిన అమ్మాయిగా రికార్డు సృష్టించింది. దీంతో చంపా రస్పెద, ఆమె కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చంపా రస్పెద ఐదేళ్ల వయసు నుంచి హాస్టల్లో ఉంటూ చదువుకుంది. అయితే ఆమె తన ఇంటి నుంచి హాస్టల్‌కు చేరుకోవడానికి 20 కిలోమీటర్ల కొండ ఎక్కి దిగాల్సి వచ్చేది. ఎలాగోలా కష్టపడి పది, ఇంటర్ పూర్తి చేసింది. ఆ తర్వాత ఆమె దృఢ సంకల్పాన్ని చూసి, బాలేశ్వర్‌కు చెందిన ఒక సైన్స్ టీచర్ ఆమెకు తన ఇంట్లో ఆశ్రయం ఇచ్చారు. చదువుకు అయ్యే అన్ని ఖర్చులను భరించి నీట్ కోచింగ్ ఇచ్చారు. ఈ క్రమంలో మొదటి ప్రయత్నంలో చంపా రస్పెద నీట్ క్వాలిఫ్ అయ్యి రికార్డు సృష్టించింది. దిదాయి కమ్యూనిటీలో నీట్‌లో అర్హత సాధించిన మొదటి బాలికగా నిలిచింది. అంతేకాకుండా ఆమె ఎంబీబీఎస్ పూర్తి చేస్తే ఆ కమ్యూనిటీకి చెందిన మొదటి వైద్యురాలు కానుంది. చంపాకు మొత్తం ముగ్గురు సోదరీమణులు, నలుగురు సోదరులు ఉన్నారు. ఆమె కుటుంబం ఆర్థిక పరిస్థితి

అంతంతమాత్రమే. చంపా తండ్రి రైతు. అతడు పోడు భూములపై పంటలను పండించేవాడు. ఆ సాగు ద్వారా సంపాదించిన రాబడితో కుటుంబాన్ని పోషించడమే కష్టమయ్యేది. అయినప్పటికీ కూతురి చంపాకు చదువుపై ఉన్న ఆసక్తిని చూసి ఆమెను ప్రోత్సహించాడు. ఈ క్రమంలో ఏడో తరగతి పాసైన తర్వాత చంపా పడవలో 60 కిలోమీటర్లు ప్రయాణించి చిత్రకొండలోని ఒక హాస్టల్‌లో ఉండి పదో తరగతి వరకు చదివింది. తర్వాత కళాశాల విద్యను పూర్తి చేసింది. అనంతరం డిగ్రీ చదువుకోవడం కోసం చంపా దరఖాస్తు చేసుకుంది.

ఈ విషయం తెలుసుకున్న ఆమె హైస్కూల్ టీచర్ ఉత్కల్ కేసరి దాస్ మెడిసిన్ చదవమని సూచించారు. తన కుటుంబం ఆర్థిక ఇబ్బందులో ఉండడంతో చంపా అందుకు నిరాకరించింది. కానీ ఉత్కల్ దాస్ అన్ని ఖర్చులను తానే భరిస్తానని చెప్పారు. బాలేశ్వర్‌లోని టాంకా గ్రామంలోని తన ఇంట్లోనే చంపాకు కోచింగ్ ఇచ్చారు. కేవలం 5 నెలలు మాత్రమే కోచింగ్ తీసుకున్న తర్వాత, చంపా మొదటి ప్రయత్నంలోనే నీట్ పరీక్షలో విజయం సాధించింది.

నీట్ తొలి ప్రయత్నంలోనే సక్సెస్ కావడంపై చంపా సంతోషం వ్యక్తం చేసింది. "నా హైస్కూల్ టీచర్ ఉత్కల్ కేసరి దాస్ నాకు చాలా సహాయం చేశారు. మా దిదాయి గిరిజన తెగ చాలా ఇబ్బందులను ఎదుర్కొంటోంది. విద్య మాకు మరొక సమస్య. మా కుటుంబం చాలా ఆర్థిక సమస్యల్లో ఉంది. మా గ్రామంలో ఆసుపత్రి లేదు. ఇటీవలే ఒక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. అయితే, నా టీచర్ సహాయంతో కచ్చితంగా నా కెరీర్‌లో అభివృద్ధి చెందుతానని నమ్మాను. మా గ్రామస్థులకు విద్యను అందించడానికి కూడా ప్రయత్నిస్తాను. ఎందుకంటే విద్య ద్వారా మాత్రమే వారు అభివృద్ధి చెందుతారు. నీట్‌లో ఉత్తీర్ణురాలైన తర్వాత నా కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి విజయం గురించి చెప్పాను. వారు, గ్రామస్థులు నా విజయం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. నేను కచ్చితంగా విజయం సాధిస్తానని వారు నమ్మారు. మా గ్రామంలో ఆసుపత్రి లేదు. చిన్న చిన్న వ్యాధులకు, వారు మూఢనమ్మకాలను నమ్ముతారు. నా మాట విని రోగాలకు చికిత్స పొందుతారని ఆశిస్తున్నాను" అని చంపా రస్పెదా తెలిపింది. అభివృద్ధి చెందని కొండ ప్రాంతంలో నివసించే గిరిజన తెగకు చెందిన యువతి చంపా వైద్య విద్య చదవబోతుండడంపై గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. చంపా సెలవుల్లో ఇంటికి వచ్చినప్పుడు గ్రామంలోని చిన్న పిల్లలకు ఉచితంగా చదువు బోధించేదని చెబుతున్నారు. మరోవైపు, నీట్ పరీక్షలో విజయం సాధించిన చంపా రస్పెదాకు జిల్లా మేజిస్ట్రేట్ సోమేశ్ కుమార్ ఉపాధ్యాయ అభినందనలు తెలియజేశారు.

# అవయవ దానానికి ప్రతిజ్ఞ చేసిన ఆర్మీ చీఫ్ దంపతులు




ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఆయన భార్య సునీత ద్వివేది తమ అవయవాలను మరణానంతరం దానం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. మరణాంతరం అవయవ దానం చేయడం ద్వారా ఒక వ్యక్తి అనేక మంది ప్రాణాలను కాపాడగలుగుతారు. అవయవ దానంపై చైతన్యం పెంచేందుకు హర్యానాలోని చండీమందిర్ మిలటరీ స్టేషన్‌లో జరిగిన అవగాహన కార్యక్రమంలో ద్వివేది పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాను, తన భార్య మరణాంతరం అవయవ దానం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అవయవ దానం ప్రాధాన్యతను ఈ సందర్భంగా ఆర్మీ చీఫ్ వివరించారు. పౌరులు, ముఖ్యంగా యువకులు, డిఫెన్స్ సిబ్బంది ఈ మహోన్నత ఆశయం కోసం ముందుకు రావాలని, అవయవ దానాన్ని జాతీయ ఉద్యమంగా చేపట్టాలని కోరారు. నేషనల్ ఆర్గాన్ డొనేషన్ అండ్ ఎలొకేషన్ ప్రోగ్రాం కింద మార్పులు చేపట్టం జరిగిందని, అవయవాల కేటాయింపులు ఇప్పుడు మహిళా రెసిపెంట్స్‌కు, డోనార్ ఫ్యామిలీస్‌కు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. మరింత మంది డోనార్లు ముందుకు వచ్చేందుకు ఇది ఉపకరిస్తుందన్నారు. ఏటా సుమారు 20,000 అవయవాల మార్పిడి (ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్స్) ఇండియాలో జరుగుతున్నాయని, గ్లోబల్ ర్యాకింగ్‌లో అమెరికా తర్వాత భారత్ రెండో స్థానంలో ఉందని చెప్పారు. సరిహద్దులను రక్షించడమే కాకుండా సమాజ సంక్షేమం కూడా ఆర్మీ బాధ్యత కావాలని అన్నారు. ఈ బాధ్యతకు కొనసాగింపే అవయవదానమని పేర్కొన్నారు.

# పెంచిన తల్లిదండ్రులకే ఆ పిల్లల్ని ఇవ్వండి

### తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు స్పష్టీకరణ

### గతంలో ఇచ్చిన ఆదేశాలు పాటించకపోవడంపై ధర్మాసనం ఆగ్రహం

### కోర్టు ధిక్కరణకు పాల్పడ్డ అధికారులు వర్చువల్‌గా హాజరు కావాలని ఆదేశం



పెంచిన తల్లిదండ్రులకే ఆ శిశువులను అప్పగించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు మరోసారి ఆదేశించింది. ఆగస్టు 26 ఉదయం 11 గంటలలోపే ఆ చిన్నారులను వారికి అప్పగించాలని స్పష్టం చేసింది. ఈమేరకు ఆగస్టు 12న తాము ఇచ్చిన తీర్పును పాటించకపోవడంపై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కరణకు పాల్పడిన అధికారులు తదుపరి విచారణ జరిగే సెప్టెంబర్ 2న వర్చువల్‌గా తమ ముందు హాజరుకావాలని ఆదేశించింది. గత ఏడాది మే నెలలో మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక రిపోర్టర్ చేసిన స్టింగ్ ఆపరేషన్‌తో పిల్లల అక్రమ రవాణా, విక్రయం వ్యవహారం వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. మహిళా ఆర్ఎంపీ వైద్యురాలి నేతృత్వంలో జరుగుతున్న తతంగంపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసు విచారణలో ఆ ఆర్ఎంపీ మొత్తం 16 మంది చిన్నారులు (నలుగురు మగ, 12 మంది ఆడపిల్లల్ని) అమ్మినట్లు గుర్తించారు.

ఈ కేసులో 11 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారు ఇచ్చిన సమాచారం ప్రకారం.. ఆ 16 మంది చిన్నారుల్లో ఏడుగురిని అమ్మకం దశలోనే పట్టుకోగా, మరో తొమ్మిది మంది పసిపాపలను అప్పటికే అక్రమ రవాణా ముఠాకు విక్రయించేశారు. ఆ తొమ్మిది మంది చిన్నారులను కొనుగోలు చేసినవారి ఆచూకీ గుర్తించి వారి నుంచి చిన్నారులను తీసుకొని రాష్ట్ర మాతా, శిశు సంక్షేమ శాఖకు అప్పగించారు. వీరిని సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (కారా) ద్వారా రాష్ట్ర ప్రభుత్వం దత్తత ప్రక్రియలో పెట్టింది. వీరిలో అమ్మకం దశలో దొరికిన ఆరుగురు చిన్నారులను కొందరు తల్లిదండ్రులు దత్తత తీసుకున్నారు. అలాగే.. మిగిలిన తొమ్మిది మంది చిన్నారులను కూడా పిల్లలు లేని కొందరు తల్లిదండ్రులు ఎంపిక చేసుకున్నారు. తమ పిల్లల్ని తమకే ఇవ్వాలంటూ వారిని అప్పటిదాకా పెంచిన (దత్తత తీసుకున్న) తొమ్మిది మంది తల్లిదండ్రులు హైకోర్టును ఆశ్రయించగా... సింగిల్ బెంచ్ వారికి అనుకూలంగా తీర్పునిచ్చింది. దీంతో.. ఆ పిల్లలను ఎంపిక చేసుకున్న తల్లిదండ్రులు వారిని తీసుకెళ్లడానికి ఒక్క పూట ముందు.. తెలంగాణ హైకోర్టు ఆదేశాలతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. దీనిని సవాల్ చేస్తూ.. రాష్ట్ర శిశు సంక్షేమ విభాగం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. ఆ అప్పీల్‌పై వాదనలు విన్న ధర్మాసనం.. రాష్ట్ర ప్రభుత్వానికి సానుకూలంగా తీర్పు ఇచ్చింది.

దీంతో.. ఆ పిల్లలను పెంచిన తల్లిదండ్రుల్లో దాసరి అనిల్ కుమార్ కుటుంబంతోపాటు మరో ముగ్గురు దంపతులు ఆ తీర్పును సవాల్ చేస్తూ.. ఈ ఏడాది ఫిబ్రవరిలో సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. ఇదే సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం తమ వాదన విన్నాకే ఉత్తర్వులు ఇవ్వాలని కేవియట్ వేసింది. ఈ పిటిషన్లపై సుదీర్ఘ వాదనలు విన్న ధర్మాసనం.. కొనుగోలు చేసిన తల్లిదండ్రులకే పిల్లల్ని ఇవ్వాలని ఈ నెల 12న తుది తీర్పు ఇచ్చింది. 14వ తేదీకల్లా వారిని తల్లిదండ్రులకు అప్పగించాలని ఆదేశించింది. ఈ తీర్పును సమీక్షించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం అప్పీల్ చేసింది. దీంతో.. 14వ తేదీకల్లా పిల్లలను తమకు అప్పగించాలన్న కోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేదని ఆ పిల్లలను పెంచిన తల్లిదండ్రులు 18న సుప్రీకోర్టులో ధిక్కరణ పిటిషన్ వేశారు. జస్టిస్ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఆ పిటిషన్‌ను విచారించింది. గతంలో ఇచ్చిన తీర్పును రాష్ట్రప్రభుత్వం అమలు చేయకపోవడంపై జస్టిస్ నాగరత్న ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సుప్రీంకోర్టు ఆదేశాలనే పాటించకపోతే ఎలా?' అంటూ అసహనం వ్యక్తం చేశారు. తమ వద్దకు వచ్చిన నలుగురు దంపతులకూ.. వారి పెంచుకున్న పిల్లలను అప్పగించాలని ఆదేశించారు. మిగిలిన ఐదుగురికి సంబంధించిన కేసు రాష్ట్ర హైకోర్టు ముందుకు రానుంది.

# భర్తపై ఆధారపడనని చెప్పొద్దు..
# అలా అయితే పెళ్లి చేసుకోవడం ఎందుకు?

## భర్త లేదా భార్యపై ఆధారపడనని భాగస్వామి చెప్పకూడదు
## ఓ కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

వివాహ బంధంలో భర్త లేదా భార్య తమ భాగస్వామి నుంచి స్వతంత్రంగా ఉండాలని కోరుకుంటున్నానని చెప్పడం అసాధ్యమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఎవరైనా స్వతంత్రంగా ఉండాలనుకుంటే వారు వివాహ బంధంలోకి అడుగుపెట్టకూడదని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. “వివాహ బంధంలో అడుగుపెట్టిన తర్వాత భర్త లేదా భార్య తాను జీవిత భాగస్వామి నుంచి స్వతంత్రంగా ఉంటానని చెప్పలేరు. అది అసాధ్యం. వివాహం అంటే ఏమిటి రెండు మనసుల కలయిక. రెండు వ్యక్తుల కలయిక. అలాంటప్పుడు భర్త లేదా భార్య ఎలా స్వతంత్రంగా ఉండగలరు? మీ పిల్లలు చిన్నవాళ్లు కాబట్టి మీరు కలిసుంటే సంతోషంగా ఉంటారు. ముక్కలైన ఇంటిని వారు చూడకూడదు. అలా చూడడానికి వారు చేసిన తప్పేంటి? ప్రతి జంట మధ్య ఏదో ఒక వివాదం ఉంటుంది. వాటిని సమన్వయంతో పరిష్కరించుకోవాలి” అని ధర్మాసనం పేర్కొంది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు విచారణలో పాల్గొన్న భార్య, తాను ఒక చేతితో చప్పట్లు కొట్టలేనని వ్యాఖ్యానించింది. అప్పుడు సుప్రీంకోర్టు ధర్మాసనం కలుగజేసుకుని కీలక వ్యాఖ్యలు చేసింది. తాము ఇద్దర్ని కలిసుండమని చెబుతున్నామని పేర్కొంది. అది మీ ఒక్కరికి మాత్రమే చెప్పట్లేదని తెలిపింది. సింగపూర్‌లో నివసిస్తున్న తన భర్త పిల్లల సంరక్షణ, వాళ్లను చూసే హక్కు కోసం మాత్రమే పోరాడుతున్నాడని, విడాకులకు ఒప్పుకోవట్లేదని సదరు మహిళ పేర్కొంది. దీనితో ‘మీరు సింగపూర్‌కు ఎందుకు వెళ్లట్లేదు? పిల్లలతో సింగపూర్‌కు తిరిగి వెళ్లడానికి మీకు ఉన్న ఇబ్బంది ఏంటి?’ అని ధర్మాసనం హైదరాబాద్‌లో నివసించే భార్యను ప్రశ్నించింది. దీంతో ఆ మహిళ తనకున్న కొన్ని ఇబ్బందులను ధర్మాసనానికి వివరించింది.

భార్యాభర్తలు ఇద్దరూ సింగపూర్‌లో మంచి ఉద్యోగాలు పొందారని, కానీ భార్య పిల్లలతో కలిసి సింగపూర్‌కు తిరిగి వెళ్లడానికి నిరాకరిస్తోందని భర్త తరఫు న్యాయవాది కోర్టుకు తెలియజేశారు. “భార్యకు ఉద్యోగం రావచ్చు. రాకపోవచ్చు. కానీ భర్త ఆమెను, పిల్లలను పోషించుకోవాలి. భార్యాబిడ్డల కోసం భర్త కొంత మొత్తాన్ని డిపాజిట్ చేయాలి” అని

సుప్రీంకోర్టు బెంచ్ అభిప్రాయపడింది. అప్పుడు, తనకు ఎవరిపైనా ఆధారపడటం ఇష్టం లేదని భార్య చెప్పింది. దీంతో ఆమె వ్యాఖ్యలపై న్యాయస్థానం మండిపడింది. "మీరు అలా చెప్పలేరు. ఆర్థికంగా మీరు అతనిపై ఆధారపడి ఉండకపోవచ్చు. కానీ మీరు వివాహం చేసుకున్న తర్వాత భావోద్వేగపరంగా భర్తపై ఆధారపడి ఉంటారు. మీకు ఎవరిపై ఆధారపడడం ఇష్టం లేకపోతే, పెళ్లి ఎందుకు చేసుకున్నారు? భర్తపై ఆధారపడకూడదని ఏ భార్య కూడా చెప్పకూడదు. మీరిద్దరూ చదువుకున్నవారు. ఇలాంటి విషయాలను ఆలోచించి పరిష్కరించుకోవాలి" అని ధర్మాసనం పేర్కొంది. పిటిషనర్ (భర్త) ప్రస్తుతం భారతదేశంలో ఉన్నారని, సెప్టెంబర్ 1న సింగపూర్ తిరిగి వెళ్తారని భర్త తరపు న్యాయవాది తెలిపారు. ఆగస్టు 23న తన చిన్న కొడుకు పుట్టినరోజు అని, దానిని తన ఇద్దరు పిల్లలతో జరుపుకోవాలని తన క్లైయింట్ (భర్త) భావిస్తున్నట్లు చెప్పారు. దీనితో జన్మదిన వేడుకల కోసం పిల్లలను పిటిషనర్‌కు అప్పగించాలని భార్యను ధర్మాసనం కోరింది. మరోవైపు తన భార్యతో సయోధ్య కోసం, విడాకుల ప్రక్రియను నిలిపివేయాలని కోరడానికి తాను సిద్ధంగా ఉన్నానని పిటిషనర్ చేసిన వాదనలను ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. భార్య, పిల్లల పోషణ కోసం రూ.5 లక్షలు డిపాజిట్ చేయాలని భర్తను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ కేసును సెప్టెంబర్16కి వాయిదా వేసింది.

# వీధి కుక్కలకు టీకాలు వేయండి

## బహిరంగ ప్రదేశాల్లో ఆహారం పెట్టవద్దని సుప్రీం ఆదేశం

వీధి కుక్కల కేసులో సుప్రీం కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ నెల 11 ఇచ్చిన తీర్పును సవరిస్తూ.. పట్టుకున్న వీధి కుక్కలను వేరే చోట వదిలేయాలని ఆదేశాలు ఇచ్చింది. రేబిస్, ఆక్రోశ స్వభావం ఉన్న కుక్కలను విడిచిపెట్టవద్దని స్పష్టం చేస్తూ.. ప్రజా ప్రదేశాల్లో కుక్కలకు ఆహారం పెట్టడాన్ని నిషేధించింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన వీధి కుక్కల కేసులో ఎట్టకేలకు తీర్పు వెలువడింది. త్రిసభ్య ధర్మాసనం వీధి కుక్కలపై దేశవ్యాప్త మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో అమలు చేయాలని సూచించింది. కుక్కలను టీకాలు, డీవార్మింగ్ చేసి తిరిగి అదే ప్రాంతంలో విడిచివేయాలని సుప్రీం పేర్కొంది. రేబిస్/ఆక్రోశ స్వభావం ఉన్న కుక్కలను విడిచిపెట్టరాదని ఉత్తర్వులు జారీ చేసింది. ఢిల్లీ నుంచి తరలించిన వీధి కుక్కలను మళ్లీ వాటి స్థానాల్లోనే వదిలి పెట్టాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. వీధి కుక్కలన్నింటినీ సురక్షిత ప్రాంతాలకు తరలించాలంటూ.. గతంలో జస్టిస్ పార్ధీవాలా ఇచ్చిన తీర్పును త్రిసభ్య

ధర్మాసనం నిలిపివేసింది. కుక్కలకు టీకాలు, డీవార్మింగ్ చేసి తిరిగి అదే ప్రాంతంలో విడిచిపెట్టాలని ఆదేశించింది. ప్రజా ప్రదేశాల్లో కుక్కలకు ఆహారం పెట్టడం నిషేధమని చెప్పుకొచ్చింది. కుక్కల కోసం ప్రత్యేకంగా కేటాయించిన ప్రదేశాల్లో ఆహారం పెట్టాలని సూచించింది. వీధి కుక్కల విషయంలో అధికారుల పనికి ఎవరూ అడ్డుపడొద్దని ఆదేశించింది. 8 వారాల తర్వాత మళ్లీ విచారణ జరుపుతామని సుప్రీంకోర్టు వెల్లడించింది.

# వాట్సప్ సందేశాల ఆధారంగా అట్రాసిటీ కేసు చెల్లదు

## ఈ మెయిల్, ప్రైవేటు సందేశాలూ అర్హమైనవి కావు

## బహిరంగంగా దూషిస్తేనే కేసు: తెలంగాణ హైకోర్టు

వాట్సాప్, ఈ-మెయిల్ వంటి ప్రైవేటు సందేశాల ఆధారంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడం చెల్లదని హైకోర్టు స్పష్టం చేసింది. అవమానించే ఉద్దేశంతో అందరి ముందు బహిరంగంగా కులం పేరుతో దూషించినప్పుడు మాత్రమే ఆ కేసు వర్తిస్తుందని పేర్కొంది. కులాంతర వివాహం చేసుకున్న క్రాంతికిరణ్ (ఎస్సీ), నిరుపమ దాడి(ఓసీ) తర్వాత పొరపొచ్చాలు రావడంతో వైవాహిక బంధం నుంచి విడిపోయారు. విడాకులు కావాలని బెదిరించడంతోపాటు సందేశాల ద్వారా కులం పేరుతో దూషించారని క్రాంతికిరణ్ ఫిర్యాదు చేయడంతో నిరుపమ, వారి కుటుంబసభ్యులపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ కేసు కొట్టివేయాలని నిరుపమ కుటుంబ సభ్యులు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు.

దీనిపై జస్టిస్ ఇ.వి. వేణుగోపాల్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. కుటుంబ వివాదంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్లు వర్తించవని పేర్కొన్నారు. ఫిర్యాదుదారు క్రాంతి తరఫు న్యాయవాది వాదిస్తూ.. ఎస్సీ పేరుతో ఎలా దూషించారు, ఎలా అవమానించారనే విషయాలు దర్యాప్తులో తేలుతాయని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం... కులం పేరుతో దూషించడం బహిరంగంగా జరిగినట్లు ఆధారాలు లేవని, ఇది కుటుంబ వివాదం మాత్రమేనని అభిప్రాయపడింది. కుటుంబ వివాదంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును కొనసాగించడం చట్టపరమైన ప్రక్రియను దుర్వినియోగం చేయడం కిందకే వస్తుందని పేర్కొంటూ పిటిషనర్లపై కేసును కొట్టేసింది.

# ఉద్యోగం లేని భర్తను హేళన చేయడం క్రూరత్వమే

## ఛత్తీస్‌గఢ్ హైకోర్టు కీలక తీర్పు




మాట్లాడుకుంటే పరిష్కారమయ్యే చిన్న కారణాలే ఎన్నో జంటల విభేదాలకు, చివరికి విడాకులకు దారి తీస్తున్నాయి. ఇలాంటి సంఘటన ఇటీవల జరిగింది. ఉద్యోగం లేదని భర్తను ఎగతాళి చేయడం మానసిక క్రూరత్వంగా పరిగణించి, 52 ఏళ్ల లాయర్‌కు విడాకులు మంజూరు చేసింది. ఈ తీర్పు మన జీవితంలో సంబంధాలు, గౌరవం, ఒకరినొకరు అర్థం చేసుకోవడం ఎంత ముఖ్యమో మరోసారి గుర్తు చేస్తోంది. డిసెంబర్ 26, 1996న భిలాయ్‌లో వివాహం చేసుకున్న ఒక జంట కథ ఇది. వీరికి 19 ఏళ్ల కూతురు, 16 ఏళ్ల కొడుకు ఉన్నారు. ఈ భర్త ఒక లాయర్, తన భార్యకు పిహెచ్‌డి పూర్తి చేయడంలో సహాయం చేశాడు. అంతేకాదు, ఆమె ఒక స్కూల్ ప్రిన్సిపాల్‌గా ఉద్యోగం సంపాదించేలా చేశాడు. కానీ, ఇక్కడే ట్విస్ట్ ఉంది. కొన్ని సంవత్సరాల తర్వాత, ఈ జంట మధ్య సమస్యలు మొదలయ్యాయి. చిన్న చిన్న విషయాలకు గొడవలు పెరిగాయి. ముఖ్యంగా, కోవిడ్ సమయంలో కోర్టులు మూతపడడంతో భర్త ఆదాయం ఆగిపోయింది.

అలాంటి కష్ట సమయంలో, భార్య ఆయనకు ఉద్యోగం లేనందుకు ఎగతాళి చేసింది. ఈ ఎగతాళి ఆయనకు మానసికంగా ఎంతో బాధ కలిగించింది. 2020 ఆగస్టులో ఒక వాగ్వాదం తర్వాత, ఆమె తన కూతురితో కలిసి ఇంటిని వదిలి వెళ్లిపోయింది. భర్త, కొడుకు ఆమెను తిరిగి ఇంటికి రప్పించేందుకు ప్రయత్నించినా, ఆమె తిరిగి రాలేదు. 2020 సెప్టెంబర్ 16 నుంచి వీరు విడిగా జీవిస్తున్నారు.

ఇది ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ముందుకు రాగా, జస్టిస్ రజనీ దుబే, జస్టిస్ అమితేంద్ర కిశోర్ ప్రసాద్‌ల డివిజన్ బెంచ్ ఈ కేసును విచారించింది. 2023 అక్టోబర్‌లో ఫ్యామిలీ కోర్టు ఈ

భర్త విడాకుల పిటిషన్‌ను తిరస్కరించింది. కానీ, హైకోర్టు ఆ తీర్పును తిరిగి సమీక్షించి, భర్తకు విడాకులు మంజూరు చేసింది.

భర్త ఆర్థికంగా కష్టాల్లో ఉన్న సమయంలో ఆయనను ఎగతాళి చేయడం మానసిక క్రూరత్వంగా పరిగణించింది. ఒకరినొకరు గౌరవించడం, అర్థం చేసుకోవడం సంబంధంలో చాలా ముఖ్యం. కానీ, ఈ భార్య చేసిన ఎగతాళి ఆయన గౌరవాన్ని దెబ్బతీసిందని కోర్టు ప్రస్తావించింది. భార్య ఎలాంటి కారణం లేకుండా ఇంటిని వదిలి వెళ్లిపోయింది. భర్త, కొడుకు ఆమెను తిరిగి రప్పించేందుకు ప్రయత్నించినా, ఆమె రాలేదు. ఇది విడిపోవడంగా హిందూ మ్యారేజ్ యాక్ట్, 1955 కింద పరిగణించారు.

ఈ జంట వివాహం పూర్తిగా బ్రేక్‌డౌన్ అయిందని కోర్టు గుర్తించింది. భార్య కోర్టు విచారణకు కూడా హాజరు కాలేదు, ఇది ఆమె వివాహాన్ని కొనసాగించే ఉద్దేశం లేనట్టు చూపిస్తుంది. ఈ కారణాలతో కోర్టు భర్తకు విడాకులు మంజూరు చేసింది. ఒక జీవిత భాగస్వామి ప్రవర్తన, మాటల ద్వారా లేదా అనవసర డిమాండ్ల ద్వారా మానసికంగా క్రూరత్వం చేస్తే, అది విడాకులకు ఆధారం అవుతుందని కోర్టు స్పష్టం చేసింది.

# ప్రేమించి పెళ్లిచేసుకున్న జంటకు కలిసి జీవించే హక్కు ఉంది

## ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన ప్రేమ జంట రక్షణ కల్పించాలని ఆదేశాలు




ప్రేమించి పెళ్లి చేసుకున్న యువతీయువకులకు కలిసి జీవించే హక్కు ఉందని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం, యువజంట ఇష్టపూర్వకంగా పెళ్లి చేసుకోవడానికి, శాంతి యుతంగా కలిసి జీవించడానికి పూర్తి స్వేచ్ఛ ఉందని తెలిపింది. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టు నూతన జంటకు భరోసా ఇచ్చింది. కుటుంబ సభ్యుల వ్యతిరేకత

వారి స్వేచ్ఛని అడ్డుకోలేదని తేల్చిచెప్పింది. ఓ ప్రేమ జంట 2025 జులై 23న ఢిల్లీలోని ఓ ఆర్యసమాజ్ ఆలయంలో హిందూ సంప్రదాయాల ప్రకారం పెళ్లి చేసుకుంది. అయితే యువతి ఇంటి నుంచి పారిపోయిన తర్వాత తమ తల్లిదండ్రుల ఇష్టానికి వ్యతిరేకంగా పెళ్లిచేసుకుంది. దీంతో యువతి తల్లిదండ్రుల పోలీస్‌స్టేషన్ ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. ఈ విషయంపై విచారణ చేపట్టిన పోలీసులు యువతి తన ఇష్టప్రకారమే పెళ్లి చేసుకుందని, వివాహం పట్ల తాను సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదును కూడా క్లోజ్ చేశారు. వివాహం తర్వాత అమ్మాయి తల్లిదండ్రులు ఆమెపై ఒత్తిడి తీసుకురావడం మొదలుపెట్టారు. దీంతో ఆ యువతి రక్షణ కోరుతూ హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ సంజీవ్ నరులా ఆ యువజంటకు పోలీసులు రక్షణ కల్పించాలని ఆదేశించారు. వీరి రక్షణ కోసం బీట్ కానిస్టేబుల్ నియమించాలని, స్థానిక పోలీస్ హౌస్ ఆఫీసర్‌ను ఆదేశాలు జారీ చేశారు. అత్యవసర సమయాల్లో సంప్రదించడానికి వారికి ఫోన్ నెంబర్లు కూడా ఇవ్వాలని కోర్టు సూచించింది. ఏమైనా బెదిరింపులు వస్తే తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. సుప్రీంకోర్టు కూడా గతంలో ఇలాంటి కేసుల్లో ఇదే సూత్రాన్ని పాటించిందని, ప్రేమ వివాహాలు చేసుకున్న వారికి బెదిరింపులు వస్తున్న నేపథ్యంలో వారికి రక్షణ కల్పించాలని ఆదేశించినట్లు గుర్తుచేసింది. ఈ కేసులో కోర్టు కేవలం ఆ యువ జంట ప్రాథమిక హక్కులపై(జీవించే హక్కు, స్వేచ్ఛ, గౌరవం) వంటి వాటికి రక్షణ కల్పించడంపైనే దృష్టి సారించిందని జస్టిస్ నరులా స్పష్టం చేశారు.

## బాలిక కిడ్నాప్, లైంగిక దాడి కేసులో

# 51 ఏళ్ల జైలుశిక్ష

### నల్లగొండ జిల్లా రెండో అదనపు జడ్జి సంచలన తీర్పు

### పోక్సో కేసులో 20 ఏళ్లు, కిడ్నాప్‌కు 10 ఏళ్లు..

### అట్రాసిటీ చట్టం కింద 20 ఏళ్లు.. బెదిరింపులకు ఏడాది జైలు

బాలికను కిడ్నాప్ చేసి, లైంగిక దాడికి పాల్పడిన యువకుడికి 51 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ నల్లగొండ జిల్లా న్యాయస్థానం సంచలన తీర్పు ఇచ్చింది. దీనితోపాటు రూ.80 వేల జరిమానా విధించింది. బాధిత బాలికకు జిల్లా న్యాయసేవా సహకార సంస్థ ద్వారా

రూ.7లక్షలు పరిహారం అందించాలని ఆదేశించింది. ఈ మేరకు నల్లగొండ జిల్లా రెండో అదనపు జిల్లా జడ్జి, ఎస్సీఎస్టీ కోర్టు, అత్యాచారం, పోక్సో కేసుల ప్రత్యేక కోర్టుల న్యాయాధికారి ఎన్.రోజారమణి తీర్పు వెలువరించారు. కేసు వివరాల మేరకు.. నల్లగొండ జిల్లా తిప్పర్తికి చెందిన ప్రైవేట్ కారు డ్రైవర్ మహమూద్ ఖయ్యూం ఓ బాలికను ప్రేమిస్తున్నానంటూ వెంటపడ్డాడు. ఆమె అంగీకరించకపోవడంతో బలవంతంగా కారులో కిడ్నాప్ చేసి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఖయ్యూం నుంచి తప్పించుకున్న బాలిక.. తల్లిదండ్రుల వద్దకు చేరుకుని జరిగిన దారుణాన్ని వివరించింది. తల్లిదండ్రులతో కలిసి వెళ్లి 2021 డిసెంబర్ 5న తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు పోక్సో, ఐపీసీ, ఎస్సీ- ఎస్టీ అట్రాసిటీ చట్టాల కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. దీనిపై వాదనలు విన్న న్యాయాధికారి తీర్పు వెలువరించారు. బాలికపై లైంగికదాడి నేరానికి పోక్సో చట్టం సెక్షన్-4 కింద 20 ఏళ్ల జైలుశిక్ష రూ.25వేలు జరిమానా.. ఆమె ఎస్సీ, ఎస్టీ వర్గానికి చెందినదని తెలిసీ దారుణానికి పాల్పడ్డందుకు ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీస్ చట్టం కింద 20ఏళ్ల జైలు, రూ.25 వేల జరిమానా.. బాలికను కిడ్నాప్ చేసిన నేరానికి ఐపీసీ సెక్షన్ 366 ప్రకారం పదేళ్ల జైలు, రూ.25 వేల జరిమానా.. నేరపూరిత బెదిరింపులకు పాల్పడినందుకు ఐపీసీ సెక్షన్ 506 ప్రకారం ఏడాది జైలు, రూ.5వేల జరిమానా.. మొత్తంగా 51 ఏళ్ల జైలుశిక్ష, రూ.80 వేలు జరిమానా విధించారు. బాధితురాలికి రూ.7 లక్షలు పరిహారాన్ని జిల్లా న్యాయ సేవా సహకార సంస్థ ద్వారా అందించాలని తీర్పులో పేర్కొన్నారు.

## బాలుడిపై లైంగికదాడి.. యువకుడికి జీవిత ఖైదు

ఏడేళ్ల బాలుడిపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడికి ప్రత్యేక న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు జడ్జి ఎన్.అమరావతి తీర్పు వెలువరించారు. బిహార్‌కు చెందిన గిరిధర్ (32) ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జగద్గిరిగుట్ట మగ్దూమ్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. 2017 జూన్ 26న అదే ప్రాంతానికి చెందిన ఏడేళ్ల బాలుడిని కిడ్నాప్ చేసి, నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం తెలిసిన బాలుడి తండ్రి జూలై 13న జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేసిన పోలీసులు సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. వాదనలు విన్న జడ్జి గిరిధర్‌ను దోషిగా నిర్ధారించి.. జీవిత ఖైదుతోపాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. బాధిత బాలుడి కుటుంబానికి 2లక్షల పరిహారం అందజేయాలని ఆదేశించారు.

# లైంగిక సమ్మతికి 18 ఏళ్లు తప్పనిసరి

## లేకుంటే బాలలపై నేరాలు, అక్రమ రవాణా పెరిగే అవకాశం
## తగ్గిస్తే చాలా ప్రమాదకరం - సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

లైంగిక చర్యకు సమ్మతి తెలపడానికి 18 ఏళ్లు దాటినవారే అర్హులన్న నియమాన్ని కేంద్ర ప్రభుత్వం సమర్థించింది. లైంగిక సమ్మతి వయోపరిమితిని 18 నుంచి 16 సంవత్సరాలకు తగ్గించాలంటూ సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ చేసిన వాదనను కేంద్రం తోసిపుచ్చింది. మైనారిటీ తీరని బాలబాలికలను లైంగిక మోసాలు, దోపిడీల నుంచి కాపాడేందుకు ఈ విధానాన్ని ఉద్దేశపూర్వకంగా, బాగా ఆలోచించి అమలు చేస్తున్నట్టు ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది.

యువతీ యువకుల మధ్య శృంగార భరిత ప్రేమ పేరుతో ఈ వయోపరిమితిని, తగ్గించడం లేదా సవరించడం చట్టవ్యతిరేకమేకాక, చాలా ప్రమాదకరం అని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటి లిఖిత పూర్వకంగా సుప్రీంకోర్టుకు తెలియజేశారు. పిల్లల మౌనాన్ని, భావోద్వేగాలను ఆసరాగా చేసుకొని లైంగిక దురాగతాలకు పాల్పడే వారిని ఈ పరిమితి కట్టడి చేస్తుందని ఆమె అత్యున్నత న్యాయస్థానానికి తెలిపారు. లైంగిక సమ్మతి వయోపరిమితిని తగ్గిస్తే అదే సాకుగా పిల్లల అక్రమ రవాణా, బాలలపై జరిగే నేరాలు అడ్డూ, అదుపూ లేకుండా పెరిగిపోతాయని ప్రభుత్వం పేర్కొంది. పోక్సో చట్టం కింద లైంగిక కార్యకలాపాలకు సమ్మతి తెలిపే వయసును 18 నుంచి 16 ఏళ్లకు తగ్గించాలని సుప్రీంకోర్టుకు అమికస్ క్యూరీ, సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ విజ్ఞప్తి చేశారు. పోక్సో చట్టం 2012, ఐపీసీ సెక్షన్ 375 ప్రకారం 16-18 ఏళ్ల వయసులో ఉన్నవారి లైంగిక కార్యకలాపాలను పూర్తిగా నేరంగా పరిగణించడాన్ని సవాల్ చేస్తూ ఆమె సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. ప్రస్తుత చట్టం కౌమారదశలో ఉన్నవారి మధ్య ఏకాభిప్రాయ ప్రేమ సంబంధాలను నేరంగా పరిగణిస్తుందని, ఇది వారి రాజ్యాంగ హక్కులను ఉల్లంఘిస్తుందని అభిప్రాయపడ్డారు.

"పోక్సో చట్టం కౌమారదశలో ఉన్నవారి మధ్య ఏకాభిప్రాయ సంబంధాలను తప్పుగా చూపిస్తోంది. వారి స్వయంప్రతిపత్తి, పరిపక్వత, సమ్మతిని విస్మరిస్తుంది. 16- 18 సంవత్సరాలకు సమ్మతి వయసును పెంచడాన్ని సమర్థించడానికి ఎటువంటి హేతుబద్ధమైన కారణం లేదా అనుభావిక డేటా లేదు. చర్చ జరగకుండానే సెక్స్ సమ్మతి వయసును 18ఏళ్లకు పెంచారు. లైంగిక కార్యకలాపాల సమ్మతి వయసు 16ఏళ్లని జస్టిస్ వర్మ కమిటీ చేసిన సిఫార్సుకు ఇది విరుద్ధంగా ఉంది. ప్రస్తుతం కౌమారదశలో ఉన్నవారు ముందుగానే యుక్తవయస్సును పొందుతారు. వారు తమకు నచ్చిన ప్రేమ, లైంగిక సంబంధాలను ఏర్పరచుకోగలరు.

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నుంచి వచ్చిన ఫలితాలతో సహా శాస్త్రీయ, సామాజిక డేటా టీనేజర్లలో లైంగిక కార్యకలాపాలు అసాధారణం కాదని సూచిస్తున్నాయి. 2017-2021 మధ్య 16-18 ఏళ్ల వయసు గల మైనర్లపై పోక్సో కేసులు 180 శాతం పెరిగాయి." అని ఇందిరాసింగ్ కోర్టుకు తెలిపారు.

కాగా, పోక్సో చట్టం ప్రకారం, ఇద్దరు వ్యక్తుల మధ్య లైంగిక సంబంధం విషయంలో సమ్మతి వయసుపై కొన్నాళ్ల క్రితం లా కమిషన్ కీలక వ్యాఖ్యలు చేసింది. లైంగిక కార్యకలాపాల్లో పాల్గొనడానికి అంగీకారం తెలిపే కనీస వయసు 18 సంవత్సరాల నుంచి 16 ఏళ్లకు తగ్గించాలనే వాదనను తిరస్కరించింది. పోక్సో చట్టం ప్రకారం ప్రస్తుతమున్న సమ్మతి వయసును మార్చడం అంత మంచిది కాదని పేర్కొంది.

# ఐదుగురు మెడికోలపై 6 నెలల సస్పెన్షన్ వేటు

## నిజామాబాద్ మెడికల్ కాలేజీ యాంటీ ర్యాగింగ్ కమిటీ నిర్ణయం

నిజామాబాద్ మెడికల్ కళాశాలలో జూనియర్ విద్యార్థి రాహుల్‌రెడ్డిని ర్యాగింగ్ చేసిన ఐదుగురు సీనియర్ విద్యార్థులను కళాశాల నుంచి 6 నెలలు సస్పెండ్ చేశారు. యాంటీ ర్యాగింగ్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్ తెలిపారు. ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం విద్యార్థి రాహుల్ రెడ్డిని సీనియర్లు ర్యాగింగ్ చేసిన ఘటన వెలుగు చూసింది. ఈ ఘటనను విద్యార్థి, ప్రజాసంఘాలు తీవ్రంగా వ్యతిరేకించగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలోని యాంటీ ర్యాగింగ్ కమిటీ సమీక్షించింది. ఈ కమిటీ ముందు విద్యార్థి రాహుల్ రెడ్డి తల్లిదండ్రులు హాజరై వాదనలు వినిపించారు.

# నిత్యపెళ్లికొడుకుపై పోక్సో కేసు

## 13 ఏళ్ల బాలికను పెళ్లాడిన కానిస్టేబుల్
## గతంలో ముగ్గురితో వివాహం, విడాకులు
## రెండేళ్ల క్రితం బాలికతో మనువు
## పోలీసులను ఆశ్రయించిన ఆమె తల్లిదండ్రులు
## బాలల సంక్షేమ అధికారుల చొరవతో కేసు

బాలికను పెళ్లాడిన సూర్యాపేట జిల్లా నడిగూడెం పోలీసస్టేషన్ కానిస్టేబుల్, నిత్య పెళ్లికొడుకుగా పేరొందిన బానోతు కృష్ణంరాజు(40)పై పోక్సో కేసు నమోదైంది. బాలల సంక్షేమ అధికారుల ఫిర్యాదుకు స్పందించిన పోలీసులు కేసు నమోదు చేశారు. సూర్యాపేట రూరల్ ఎస్సై బాలునాయక్ వివరాల మేరకు.. సూర్యాపేట మండలం సపావత్‌తండాకు చెందిన ఓ బాలికను చివ్వేంల మండలం తుల్జారావుపేటకు చెందిన బానోతు కృష్ణంరాజు 2023 డిసెంబరులో పెళ్లి చేసుకున్నాడు. వివాహ సమయంలో బాలిక వయస్సు 13 ఏళ్లు. దీని కంటే ముందు కృష్ణంరాజుకు మూడు పెళ్లిళ్లు జరిగాయి. ఆ ముగ్గురితోనూ విడాకులయ్యాయి. దీంతో కృష్ణంరాజు నిత్య పెళ్లికొడుకుగా పేరొందాడు. కృష్ణంరాజు చరిత్రను బాలిక తల్లిదండ్రులు ఆలస్యంగా తెలుసుకున్నారు. గతంలో జరిగిన మూడు పెళ్లిళ్ల సంగతి చెప్పకుండా కృష్ణంరాజు తమ కుమార్తెను పెళ్లి చేసుకుని మోసగించాడని బాధిత బాలిక తల్లిదండ్రులు 10 రోజుల క్రితం పోలీసులను ఆశ్రయించారు. దాంతో స్పందించిన అధికారులు 2012 బ్యాచ్‌కు చెందిన కృష్ణంరాజును విధుల నుంచి సస్పెండ్ చేశారు. అయితే, బాలల సంక్షేమ అధికారులు జోక్యం చేసుకుని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కృష్ణంరాజుపై చైల్డ్, మ్యారేజ్ ప్రొవిజన్ చట్టం కింద అత్యాచారం, పోక్సో కేసు నమోదు చేశారు. కృష్ణంరాజు పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

# ఎనిమిదవ తరగతి విద్యార్థిపై టీచర్ దాడి.. మూడు చోట్ల విరిగిన ఎముకలు..!

విశాఖపట్నం మధురవాడలోని పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో శ్రీ తనుష్ పాఠశాలలో అమానుష ఘటన చోటుచేసుకుంది. సదరు పాఠశాలలో 8వ తరగతి

చదువుతోన్న విద్యార్థి చేయి విరగొట్టాడు ఉపాధ్యాయుడు. విద్యార్థి చేతిని ఇనుప బల్ల కేసి చితకబాది.. ఆపై పిడుగులు గుద్ది చేయి విరగగొట్టాడు. దీంతో ఆ విద్యార్థికి శరీరంలో మూడు భాగాల్లో ఎముకలు విరిగాయి. శస్త్ర చికిత్స కోసం విద్యార్థిని ఆసుపత్రికి తరలించారు. విద్యార్థిపై దాడికి కారణమైన సోషల్ మాస్టర్ మోహన్.. ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. ఈ ఘటనపై స్కూల్ ప్రిన్సిపల్ శివ సత్యనారాయణను నిలదీయగా అతను నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థి తల్లిదండ్రులు చెప్పారు. ఇక, స్కూల్ వద్ద సదరు విద్యార్థి తల్లిదండ్రులు, కాలనీవాసులు ఆందోళనకు దిగారు.

# లైంగిక వేధింపులు తాళలేక బాలిక మృతి

## వీడియోలు తీసి బెదిరిస్తూ ముగ్గురు యువకుల అకృత్యం

## మానసిక క్షోభతో అనారోగ్యంపాలై మృతిచెందిన బాధితురాలు

## అంతకముందే రాసిన లేఖ, సెల్‌ఫోన్ వల్ల బయటపడ్డ ఘోరం

తల్లికి దూరంగా తండ్రితో కలిసి జీవిసిస్తున్న ఓ బాలిక(17)పై ముగ్గురు యువకులు ఆకృత్యానికి పాల్పడ్డారు. ఆ వేధింపులు తాళలేక, కష్టాన్ని ఎవరికి చెప్పుకోవాలో తెలియక మానసిక్ష క్షోభతో అనారోగ్యం పాలై ఆ బాలిక మరణించింది. పోలీసులు తెలిపిన వివరాలమేరకు రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలానికి చెందిన బాధిత బాలిక తల్లిదండ్రులు విభేదాల వల్ల వేర్వేరుగా ఉంటున్నారు. బాలిక తండ్రితో కలిసి నివసిస్తుండగా.. తల్లి, సోదరుడు మరో జిల్లాలో ఉంటున్నారు. తండ్రితో కలిసి సంతలో కూరగాయలు అమ్మే ఆ బాలికకు వినోద్ అనే యువకుడితో పరిచయమైంది. వారిద్దరూ సన్నిహితంగా ఉన్నప్పుడు తీసిన వీడియోను వినోద్ తన స్నేహితుడు సతీశ్‌కు పంపాడు. సతీశ్ ఆ వీడియోను బాలికకు చూపించి ఆమెపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఆ తర్వాత ఆ వీడియోను జాషు అనే యువకుడికి పంపగా అతడు కూడా లైంగిక వేధింపులకు దిగాడు. తాము చెప్పినట్టు వినకపోతే వీడియోను సోషల్ మీడియాలో పెడతామని బెదించి బాలికపై ముగ్గురూ లైంగిక వేధింపులకు తెగబడ్డారు. భరించ లేకపోయిన ఆ బాలిక తనపై జరుగుతున్న ఆకృత్యాన్ని వివరిస్తూ కొద్ది రోజుల క్రితం ఓ లేఖ రాసుకుంది. మానసిక క్షోభతో కొద్ది రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యింది. జ్వరంతో బాధపడుతున్న బాలికకు ఫిట్స్ రావడంతో ఆమెను ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బాలికను సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రాణం విడిచింది. అయితే, బాలిక ఉండే గదిలో ఆమె రాసిన లేఖతోపాటు ఓ సెల్‌ఫోన్‌ను కుటుంబసభ్యులు గుర్తించారు. ఆ సెల్‌ఫోన్‌లో

యువకులు పంపిన వీడియోలను చూసి అవాక్కయ్యారు. దీనిపై బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సతీష్, వినోద్, జాషలపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

# ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య

కుటుంబకలహాలు, వివాహేతర సంబంధాలు, ఆర్థిక సమస్యలు వంటివి భాగస్వాముల ప్రాణాలను తీస్తున్నాయి. ముఖ్యంగా వివాహేతర సంబంధాలు కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. పెళ్లయిన పిల్లలు ఉన్నా.. ఇతరులపై వ్యామోహంతో కట్టుకున్న వారినే కడతేరుస్తున్నారు. ఈ క్రమంలో కడుపున పుట్టిన అభంశుభం తెలియని పిల్లలను రోడ్డుపైకి తెస్తున్నారు. భర్తను భార్య చంపడమో, భార్యను భర్త చంపడమో చేస్తూ జైలు పాలవుతున్నారు. తాజాగా అలాంటి ఘటనే నిర్మల్ జిల్లాలో చోటు చేసుకుంది. నిర్మల్ జిల్లా సోన్ మండలం వెల్మల్ గ్రామంలో ఓ భార్య దాష్టీకానికి భర్త బలయ్యాడు. భార్య నాగలక్ష్మి ప్రియుడు మహేష్‌తో కలిసి భర్త హరిచరణ్‌ను హత్య చేసింది. నాగలక్ష్మి అదే గ్రామానికి చెందిన మహేష్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. భర్తకు తెలియడంతో 5 రోజుల క్రితం టవల్‌తో గొంతు నులిమి హతమార్చింది. అనంతరం హరిచరణ్ మూర్ఛ వచ్చి చనిపోయాడని బంధువులను, గ్రామస్తులను నమ్మించింది. తల్లిపై అనుమానంతో కుమారుడు కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు నిజానిజాలను రాబట్టి నాగలక్ష్మిని ఆమె ప్రియుడు మహేష్‌ను అరెస్ట్ చేశారు.

# ప్రైవేటు స్కూలు విద్యార్థుల మధ్య ఘర్షణ

## దాడి చేసి.. ఇస్త్రీ పెట్టెతో వాతలు పెట్టి..
## విద్యార్థికి తోటి విద్యార్థుల చిత్రహింసలు

విద్యార్థుల మధ్య మనస్పర్థలు విచక్షణారహితంగా దాడి చేసి.. ఏకంగా ఇస్త్రీ పెట్టెతో శరీరంపై వాతలు పెట్టే వరకూ వెళ్లింది. ఈ ఘటన తూర్పుగోదావరి జిల్లాలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో చోటుచేసుకుంది. బాధిత విద్యార్థి, తల్లి తెలిపిన వివరాల మేరకు.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం శంకరగుప్తం గ్రామానికి చెందిన గుర్రం విన్సెంట్ ప్రసాద్ రాజమహేంద్రవరం మోరంపూడిలోని ఓ ప్రైవేటు కార్పొరేట్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. ఈ బాలుడితో పాటు విశాఖపట్నం, గోకవరం, రాజోలుకు చెందిన పలువురు విద్యార్థులు కూడా ఆ స్కూల్‌కు చెందిన హాస్టల్‌లోని ఒకే రూమ్‌లో

ఉంటారు. వీరిలో ఇద్దరు హాస్టల్‌లోని ఒక సీసీకెమెరాను తీసి తన బ్యాగులో పెట్టిన విషయాన్ని ప్రసాద్ ప్రిన్సిపాల్‌కు చెప్పాడు. దీంతో కక్ష పెంచుకున్న వారు ఈనెల 18న హాస్టల్ రూమ్‌లో ప్రసాద్‌ను విచక్షణారహితంగా కొట్టి.. ఇస్త్రీ పెట్టెతో కాళ్లు, పొట్ట, చేతులపై వాతలు పెట్టారు. ఎవరికైనా చెబితే మళ్లీ కొడతామని బెదిరించారు. దీంతో బాధితుడు ఎవరికీ చెప్పకుండా బాధను భరిస్తూ వారం రోజులు గడిపాడు. ఈ క్రమంలో హాస్టల్‌కు వెళ్లిన తల్లి లక్ష్మీకుమారి.. కుమారుడి చేతిపై గాయాలు చూసి అడగ్గా.. వేడినీళ్లు పడ్డాయని ప్రసాద్ అబద్దం చెప్పాడు. ఆ తర్వాత ఇద్దరూ ఇంటికి వచ్చారు. అనంతరం కుమారుడు పొట్టపై పెద్దగా కాలిన గాయం కనబడడంతో తల్లి నిలదీసింది. దీంతో ప్రసాద్ హాస్టల్‌లో జరిగిన ఘటన గురించి చెప్పాడు. బాధిత బాలుడిని రాజోలు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. తల్లి ఫిర్యాదుతో డీఎస్ఈవో వాసుదేవరావు స్వయంగా స్కూల్‌కు వెళ్లి ఆరా తీశారు.

# వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య

తల్లిదండ్రుల నుంచి అదనపు కట్నంతో పాటు బంగారం ఇప్పించాలని భార్యను భర్తతో పాటు అత్తవారింటి వారు వేధింపులకు గురి చేయడంతో ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. ఉరి వేసుకొని వెంకటేశ్వరి (సంధ్య) ఆత్మహత్య చేసుకొన్న సంఘటన కోయిలకొండ మండలం రాంపూర్ గ్రామంలో చోటు చేసుకొంది. ఎస్ఐ తిరుపాజీ ఇందుకు గల వివరాలను వెల్లడించారు. కోయిలకొండ మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన గంజి రాజుకు హన్వాడ మండలం కొత్తపేట గ్రామానికి చెందిన వెంకటేశ్వరితో 2024 అక్టోబర్ 17న రాంపూర్‌లో వివాహం జరిగింది. రాజుకు వరటక్నం కింద రూ 2లక్షలు, 4 తులాల బంగారం అందించారు. కొన్ని రోజులు అయిన తరువాత భర్త రాజు అవసరం కోసం పెళ్లిలో పెట్టిన బంగారం తకట్టు పెట్టి డబ్బులు తీసుకున్నాడు.

ఆ తరువాత వెంకటేశ్వరి వారి తల్లి గారి నుంచి బంగారంతో పాటు డబ్బులు ఇవ్వాలని రాజు భార్యను వేధిస్తున్నాడు. డబ్బులు తీసుకురావాలని భార్యని తల్లిగారి ఇంటికి పంపించాడు. పంచాయతీ పెట్టి సర్ది చెప్పి భార్య వెంకటేశ్వరిని అత్తవారి ఇంటికి పంపించారు. మళ్లీ భర్త రాజు, అత్తంటివారు వరకట్నం కోసం వేధింపులకు గురి చేయడంతో వెంకటేశ్వరి అత్తవారింటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. బాధితురాలి తల్లి అంజమ్మ ఫిర్యాదు మేరకు భర్త గంజి రాజు, అత్త, మామలు గంజి రాములు, దేవమ్మ, మరిది నాని, ఆడకూతురు జ్యోతి, మేనమామ పారుపల్లి శ్రీహరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

# పెట్రోల్ పోసి టీచర్‌కు నిప్పు పెట్టిన విద్యార్థి

## గాయాలతో బయటపడిన టీచర్.. మధ్యప్రదేశ్‌లో దారుణం

స్కూల్‌లో పాఠం చెప్పిన టీచర్‌పై పెట్రోల్‌తో దాడి చేసి.. ఆమెను ఒక విద్యార్థి తీవ్రంగా గాయ పరిచాడు. ఈ దారుణ సంఘటన మధ్యప్రదేశ్ నర్సింగ్‌పూర్ జిల్లాలోని కొత్వాలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. 18 ఏళ్ల సూర్యాంశ్ కొచ్చార్.. తనకు స్కూల్‌లో పాఠం చెప్పే టీచర్‌పై ప్రేమ పెంచుకున్నాడు. ఈ విషయాన్ని స్కూల్ టీచర్‌కు తెలిపారు. దీంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ఇదే విషయాన్ని స్కూల్ యాజమాన్యం దృష్టికి టీచర్ తీసుకు వెళ్లింది. దీంతో సూర్యాంశ్ కొచ్చార్‌పై స్కూల్ యాజమాన్యం సస్పెన్షన్ వేటు వేసింది. ఆ క్రమంలో అతడికి స్కూల్ యాజమాన్యం టీసీ ఇచ్చి పంపించేసింది. అనంతరం అతడు మరో స్కూల్‌లో జాయిన్ అయ్యారు. అయితే ఆగస్టు 15. స్వాతంత్ర్య దినోత్సవం. ఈ సందర్భంగా స్కూల్ టీచర్ కొత్త చీర కట్టుకుంది. ఈ సందర్భంగా ఆమెను సూర్యాంశ్ కామెంట్ చేశాడు.

దీంతో ఆగ్రహించిన టీచర్.. అతడిపై మండిపడింది. ఈ నేపథ్యంలో ఆమెపై అతడు కోపాన్ని పెంచుకున్నాడు. అందులోభాగంగా ఆగస్టు 18వ తేదీన పెట్రోల్ బాటిల్‌ను టీచర్ ఇంటికి తీసుకు వెళ్లాడు. ఆ తర్వాత ఆమె శరీరంపై పెట్రోల్ జల్లాడు. అనంతరం అగ్గిపుల్ల వెలిగించి నిప్పంటించి పరారయ్యాడు. స్థానికులు వెంటనే స్పందించి.. ఆమెను ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. అయితే ఆమెకు తీవ్ర గాయాలైనా.. ప్రాణానికి ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు స్పష్టం చేశారు. మరోవైపు ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా సూర్యాంశ్ కోసం పోలీసులు ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టారు.

చివరకు డోంగర్గావ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాళ్యాణ్ పూర్‌లో అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు. బాధితురాలి వాంగ్మూలం తీసుకున్న తర్వాత.. అతడిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు వివరించారు.

# నకిలీ డాక్టర్ నిర్వాకం.. గర్భిణీకి ఆపరేషన్ తల్లి, బిడ్డ మృతి

దేశంలో వైద్య రంగం అభివృద్ధి చెందుతున్నప్పటికీ, ఇంకా అనేక ప్రాంతాల్లో అర్హత లేని వ్యక్తులు డాక్టర్ల ముసుగులో నకిలీ వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలు కోల్పోయేలా చేస్తున్నారు. తాజాగా ఇలాంటి ఘటన ఒడిశాలోని గంజాం జిల్లాలో చోటుచేసుకుంది. ఒక నర్సింగ్ హోమ్‌లో, వైద్య అర్హత లేని వ్యక్తి డెలివరీ చేయడంతో ఒక తల్లి, ఆమె నవజాత శిశువు ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. గంజాం జిల్లాలోని డెంగౌస్తాలో మంగులు చరణ్ ప్రధాన్ అనే 35 ఏళ్ల వ్యక్తి ఒక నర్సింగ్ హోమ్ నిర్వహిస్తున్నాడు. ఆయనకు ఎలాంటి వైద్య అర్హత లేదు. కానీ మే 11న ఒక మహిళ ప్రసవం కోసం ఆసుపత్రిలో చేరినప్పుడు, అతను ఇద్దరు సహాయక నర్సులతో కలిసి డెలివరీ చేశాడు. ఈ ఇద్దరు సహాయక నర్సులు మధుస్మితా పట్టనాయక్, ప్రమోదిని గమాంగో. వీళ్లకు కూడా డెలివరీ చేసే అనుభవం, అర్హత సరిగ్గా లేవు. అసలు ఆ నర్సింగ్ హోమ్‌లో రిజిస్టర్డ్ డాక్టర్ ఎవరూ లేరు. ఈ ఘటనలో బాధితురాలు రోజీ నాయక్. ఆమె భర్త బాబు నాయక్ చెప్పిన ఫిర్యాదు ప్రకారం, నర్సింగ్ హోమ్ వాళ్లు తమకు అన్ని సౌకర్యాలు ఉన్నాయని, సురక్షితంగా డెలివరీ జరుగుతుందని హామీ ఇచ్చినట్లు చెప్పారు.

ఈ మాటలు నమ్మి, రోజీని మే 11న అక్కడ చేర్పించారు. నాలుగు గంటల ప్రసవ వేదన తర్వాత డెలివరీ జరిగింది. కానీ దురదృష్టవశాత్తూ, పుట్టిన బిడ్డ కొద్దిసేపటికే మరణించింది. రోజీ కూడా తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో మెడికల్ కాలేజ్ హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలోనే కన్నుమూసింది. ఈ ఘటన తర్వాత, బాబు నాయక్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. డిగపహండి పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ ప్రశాంత్ కుమార్ చెప్పినట్టు, మంగులు చరణ్ ప్రధాన్‌ను అరెస్ట్ చేశారు. ఇద్దరు సహాయక నర్సులను కూడా మే 19, ఆగస్టు 10 తేదీల్లో అరెస్ట్ చేశారు. ఈ నర్సింగ్ హోమ్ వాళ్లు తప్పుడు హామీలతో ఆ కుటుంబాన్ని మోసం చేశారని పోలీసులు తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లలో చేరే ముందు వాటి విశ్వసనీయత గురించి తప్పక తెలుసుకోవాలి. అక్కడ రిజిస్టర్డ్ డాక్టర్లు ఉన్నారా, సరైన సౌకర్యాలు ఉన్నాయా లేదో చూడాలి. మరోవైపు ప్రభుత్వం కూడా ఇలాంటి నర్సింగ్ హోమ్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలి.

# మహిళా జైలు సూపరింటెండెంట్ సస్పెన్షన్

## రిమాండ్ ఖైదీ మృతికి నిర్లక్ష్యమే కారణం!

## అంతర్గత విచారణలో తేల్చిన అధికారులు

## సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసిన సౌమ్యమిశ్రా

వరంగల్ జిల్లా నర్సంపేట మహిళా జైలు సూపరింటెండెంట్ కే.ఎన్.ఎస్. లక్ష్మీశ్రుతిని సస్పెండ్ చేస్తూ జైళ్లశాఖ డీజీ సౌమ్యమిశ్రా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న పెండ్యాల సుచరిత మృతికి సంబంధించి.. సూపరింటెండెంట్ నిర్లక్ష్యమే కారణమని అంతర్గత విచారణలో తేలడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. కడుపు నొప్పితో బాధపడిన సుచరిత ఆస్పత్రికి తీసుకెళ్లకపోగా.. ఆమెను మానసికంగా హింసించారనే ఆరోపణలు వెలువడ్డాయి. దళిత సంఘాలు కూడా జైలు అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా ధర్నా, రాస్తారోకో నిర్వహించాయి. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాయి. దీంతో అంతర్గత విచారణ జరిపినట్లు జైళ్ల శాఖ అధికారి పరవస్తు వెంకటేశ్వరస్వామి తెలిపారు. మహిళా సూపరింటెండెంట్ లక్ష్మీశ్రుతి నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ప్రాథమిక సమాచారంతో ఆమెను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. పూర్తి విచారణ తర్వాత శాఖాపరమైన చర్యలు ఉంటాయని వివరించారు. లక్ష్మీశ్రుతి స్థానంలో స్రవంతిని సూపరింటెండెంట్‌గా నియమించినట్లు తెలిపారు.

# హాస్టల్లో విషప్రయోగం

## విద్యార్థులు తాగే నీటిలో గడ్డి మందు కలిపిన ఉపాధ్యాయుడు

## తనతో పడని ఓ అధికారిని ఇరికించే కుట్ర

## విధుల నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు, వంట కార్మికురాలి తొలగింపు

## జయశంకర్ భూపాలపల్లి జిల్లా అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఘటన

తల్లిదండ్రులకు దూరంగా హాస్టల్‌లో ఉండే విద్యార్థులను కన్నబిడ్డల్లా చూసుకోవాల్సిన ఉపాధ్యాయుడు.. కర్కోటకుడిగా మారాడు. తనతో విభేదాలు నెలకొన్న ప్రత్యేకాధికారిని ఇరికించేందుకు విద్యార్థుల ప్రాణాలు తీయాలని చూశాడు. హాస్టల్‌లో విద్యార్థులు

వినియోగించే నీళ్లలో విషం కలిపాడు. దీంతో 11 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఈ ఘటన చోటుచేసుకోగా.. విచారణలో విస్తుపోయే విషయాలు వెల్లడయ్యాయి. ఐదు నుంచి ఎనిమిదో తరగతి వరకు చదువుతున్న 30 మంది విద్యార్థులు ఈ స్కూల్‌లో ఉన్నారు. శుక్రవారం ఉదయం అల్పాహారం చేసిన తర్వాత 11 మంది విదార్థులు నీటిని తాగి అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఉపాధ్యాయులు వారిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అయితే.. విద్యార్థులు తాగే నీటిలో పాఠశాలలో విధులు నిర్వర్తించే ఓ ఉపాధ్యాయుడే గడ్డిమందు కలిపినట్టు తేలింది. మందు కలిపిన సీసా కూడా తమ గదిలో దొరికినట్టు విద్యార్థులు తెలిపారు. ఈ ఘటనకు ఓ ఉపాధ్యాయుడు, ప్రత్యేక అధికారి మధ్య ఉన్న గొడవే కారణమని విద్యార్థులు అంటున్నారు. ప్రత్యేక అధికారిని ఇరికించేందుకు ఆ ఉపాధ్యాయుడు నీళ్లల్లో గడ్డి మందు కలిపాడని ఆరోపిస్తున్నారు. గడ్డి మందు నీళ్లలో కలిపిన ఆ ఉపాధ్యాయుడు తమ దుప్పట్లపై కూడా దానిని చల్లి ఆ నెపాన్ని తమపై నెట్టేసే ప్రయత్నం చేశాడని చెబుతున్నారు. హాస్టల్‌ను సందర్శించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, డీఎస్పీ సంపత్‌రావుకు ఈ విషయాలను విద్యార్థులు వెల్లడించారు. పాఠశాలలో పనిచేస్తున్న ఎస్వో, మరో ముగ్గురు ఉపాధ్యాయులకు తరచుగా గొడవలు జరుగుతున్నాయని తెలిపారు. ముగ్గురు ఉపాధ్యాయులు తరచూ తమను వేధిస్తున్నారని చెప్పారు. కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే హాస్టల్‌కు చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. ఈ ఘటనపై విచారణ చేపట్టి దీనికి కారణమైన ఉపాధ్యాయుడు రాజేందర్‌తోపాటు మరో ఇద్దరు ఉపాధ్యాయులు వేణు, సూర్యకిరణ్, వంట కార్మికురాలు రాజేశ్వరిని విధుల నుంచి తొలగిస్తున్నట్టు పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేశారు.

# డెలివరీ సమయంలో వైద్యుల నిర్లక్ష్యం అప్పుడే పుట్టిన శిశువు చేయి కట్!

నుహ్‌లోని మాండిఖేడాలోని అల్ అఫియా సివిల్ హాస్పిటల్‌కు సర్జినా ఇటీవల ప్రసవానికి వచ్చారు. డెలివరీ చేసిన సమయంలో వైద్యులు నిర్లక్ష్యం కారణంగా శిశువు చేయి తెగిపోయిందని కుటుంబసభ్యులు తెలిపారు. దీంతో ఒక్కసారిగా వారంతా ఆస్పత్రిలో గందరగోళం సృష్టించారు. వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డయల్ 112కు ఫిర్యాదు చేయడంతో ఘటనాస్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం

అందించింది. అదే సమయంలో బాధితురాలి కుటుంబసభ్యులు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రసవం అయిన తర్వాత డాక్టర్ తమ వద్దకు వచ్చి సర్జినా ఒక మగబిడ్డకు జన్మనిచ్చిందని తెలిపినట్లు ఫిర్యాదులో తెలిపారు. కానీ ఒక చిన్న బ్లేడ్ ప్రమాదవశాత్తు బాలుడి చేతికి తగిలిందని చెప్పినట్లు పేర్కొన్నారు. అప్పుడే వార్డుకు వెళ్లి శిశువును చూసినప్పుడు, కుడి చేయి శరీరం నుంచి వేరు చేసి ఉందని చెప్పారు. అప్పుడు తాము బ్లేడ్ తగిలితే ఏకంగా చేయి తెగడమేంటిని ప్రశ్నించినట్లు వెల్లడించారు. అప్పుడు డాక్టర్లు తమపై తిరిగి దురుసుగా ప్రవర్తించారని తెలిపారు. ఆసుపత్రి నుంచి బయటకు పంపేశారని ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఇది జరిగిందని, కేసు నమోదు చేయాలని, నిందితులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మహిళ కుటుంబం పోలీసు అధికారులను కోరింది.

# బిడ్డకు జన్మనిచ్చిన 14 ఏళ్ల బాలిక

ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలో అత్యాచారానికి గురైన 14 ఏళ్ల బాలిక ఒక శిశువుకు జన్మనిచ్చింది. లఖ్‌నవూలోని హజ్రత్‌గంజ్‌లో ఉన్న ఝూల్కారి బాయి ఆసుపత్రిలో ఆ బాలిక ప్రసవించగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పురిటి నొప్పులు రావడంతో హుటాహుటిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు ప్రసవం చేసారు. అయితే బాలికపై అత్యాచారం చేసిన 23 ఏళ్ల నిందితుడు ప్రస్తుతం జైలులో ఉన్నాడు. యూపీలోని బహ్రైచ్ జిల్లాకు చెందిన బాలిక కుటుంబం బతుకుదెరువు కోసం లఖ్‌నవూకు వలస వచ్చింది. ఈ సమయంలో ప్రమోద్ అనే యువకుడు తరచుగా వారి ఇంటికి వచ్చేవాడు. కుటుంబ పరిచయం ఉన్న కారణంగా, ఎవరూ అనుమానించలేదు. ఈ క్రమంలో అతడు బాలికపై పలుమార్లు అత్యాచారం లైంగిక దాడి చేశాడు. బాలిక ఆరోగ్యంలో మార్పులు గమనించిన తల్లిదండ్రులు బాలికను గట్టిగా అడగ్గా తనపై జరిగిన లైంగిక దాడి గురించి తల్లిదండ్రులకు చెప్పింది. ఈ ఘటన గత మే 9న వెలుగులోకి రాగా మరుసటి రోజు తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసారు. మే 30న పోలీసులు కేసు నమోదు చేసి యువకుడిని అరెస్టు చేసారు. అనంతరం బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించగా ఆమె గర్భవతి అనే షాకింగ్ విషయం తెలిసింది. ఆగస్టు 6 రాత్రి బాలికకు పురిటి నొప్పులు రాగా కుటుంబ సభ్యులు ఝూల్కారి బాయి ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఆగస్టు 7న ఉదయం 3 గంటల ప్రాంతంలో సాధారణ ప్రసవం ద్వారా ఆ బాలిక మగ బిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లి, బిడ్డ ఇద్దరు క్షేమంగా ఉన్నట్లు ఆస్పత్రి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ తెలిపారు.


# ఇకపై నేరుగా మొబైల్‌కే సమన్లు.. వారెంట్లు

## ఢిల్లీలో డిజిటల్ కోర్టు నోటీసులు ప్రారంభం

న్యాయవ్యవస్థను మరింత పారదర్శకంగా, ఆధునికంగా మార్చే దిశగా ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బీఎన్ఎస్ఎస్ సమన్లు, వారెంట్ సేవ (BNSS) నియమాలు 2025 నోటిఫై చేసి, డిజిటల్ కోర్టు నోటీసులను ప్రారంభించింది. అంటే ఇకపై కోర్టు సమ్మన్లు, వారెంట్లు సాంప్రదాయ పద్ధతిలో కాకుండా, డిజిటల్ మార్గాల ద్వారా నేరుగా ప్రజలకు చేరవేస్తారు. సింపుల్‌గా చెప్పాలంటే వాట్సాప్, ఈ-మెయిల్స్‌కు కోర్టు నోటీసులు పంపిస్తారు. గతంలో కోర్టు సమన్లు, వారెంట్లను పోస్టు ద్వారా పంపించేవారు. లేదా పోలీసు సిబ్బంది నేరుగా వెళ్లి అందించేవారు. దీనికి ఎక్కువ సమయం పట్టేది. ఖర్చు కూడా ఎక్కువ అయ్యేది. పైగా చాలా సార్లు సమన్లు ఆలస్యం కావడమో, లేదా సమన్లు పూర్తిగా అందకపోవడమో జరిగేది. కానీ కొత్త వ్యవస్థ వల్ల ఈ సమస్య తొలగిపోతుంది. ఇ-సమన్లు, ఈ వారెంట్ నోటీసులను సకాలంలో అందజేయడం వీలవుతుంది. పైగా ప్రభుత్వ వనరులను బాగా ఉపయోగించుకోవడానికి, ఖర్చు తగ్గించుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. ఢిల్లీ హోంశాఖ జారీ చేసిన ఈ నోటిఫికేషన్‌ను గతంలోనే లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ సక్సేనా ఆమోదించారు. ఇటీవలే దీనిని అమలులోకి తెచ్చారు. ఈ డిజిటల్ కోర్టు నోటీసుల జారీ చాలా ప్రభావవంతంగా పనిచేస్తోందని అధికారులు చెబుతున్నారు. ఇది కోర్టుల పనితీరుపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుందని, ప్రజలకున్న అనవసర అడ్డంకులను తొలగిస్తుందని స్పష్టం చేస్తున్నారు.

డిజిటల్ కోర్టు నోటిసులు వల్ల సామాన్యులకు చాలా ప్రయోజనం చేకూరుతుంది. ఎలా అంటే, కోర్టు ఎవరినైనా సాక్షిగా రమ్మని సమన్లు పంపితే, ఆ నోటీసు నేరుగా సదరు వ్యక్తి వాట్సాప్, ఈ-మెయిల్‌కు వెళ్తుంది. అందువల్ల సరైన వ్యక్తికి, సకాలంలో విషయం తెలుస్తుంది. ఇదివరకట్లా సమన్లు సకాలంలో అందకపోవడం, రాంగ్ పర్సన్స్‌కు వెళ్లడం లాంటివి జరగవు. కోర్టు వ్యవహారాల్లో సాంకేతిక పరిజ్ఞానం వాడడం కొత్తేమీ కాదు. ఇప్పటికే ఇ-ఫైలింగ్, వీడియో కాన్ఫరెన్సింగ్ లాంటి జరుగుతున్నాయి. ఇప్పుడు ఈ-సమన్లు, ఈ-

వారెంట్లు కూడా అమల్లోకి వచ్చాయి. ఈ విధంగా న్యాయవ్యవస్థకు సంబంధించిన డిజిటల్ చైన్ మరింత బలపడుతోంది. దీనితోపాటు నోటీసు డెలివరీ పూర్తి రికార్డును భద్రపరచడానికి, సంరక్షించడానికి సెక్యూర్డ్? ఫ్రేమ్?వర్క్?ను సిద్ధం చేస్తున్నారు. ఢిల్లీ సర్కార్ తీసుకున్న ఈ చర్యలు కోర్టులపై ఉన్న భారాన్ని తగ్గించడంతోపాటు, పౌరలకు కూడా చాలా సౌలభ్యాన్ని కలిగిస్తాయి. లీగల్ నోటీసులను డిజిటల్‌గా అందించడం వల్ల పారదర్శకత పెరగడమే కాకుండా, న్యాయవ్యవస్థ సకాలంలో, మరింత విశ్వసనీయంగా పనిచేయడానికి వీలు ఏర్పడుతుంది. భారతదేశం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమాల్లో డిజిటల్ ఇండియా మిషన్ ఒకటి. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దేశ అభివృద్ధికి ఇది తోడ్పడుతుంది. సాధారణ ప్రజలకు కూడా డిజిటల్ సేవలు అందుకునేందుకు సహాయపడుతుంది. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య ఉన్న దూరాన్ని తగ్గిస్తుంది. 2015, జులై 1న ఈ మిషన్‌ను ప్రారంభించారు. డిజిటల్ ఇండియా మిషన్‌లో భాగంగా రూపొందించిన వివిధ కార్యక్రమాలు, సేవలు : కో-విన్, జీవన్ ప్రమాణ్, జెనిసిస్, ఉమాంగ్, భాషిణి, మేరిపహచాన్, ఫ్యూచర్ స్కిల్స్‌ప్రైమ్, డిజిలాకర్, ఇ-సైన్, స్వచ్ఛభారత్ మిషన్ మొబైల్ యాప్, నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్, నేషనల్ డిజిటల్ కమ్యూనికేషన్ పాలసీ - 2018, ఇ-హాస్పిటల్, భారత్ నెట్, జీమ్ యాప్ మొదలైనవి ఉన్నాయి.



# చనుబాలే ఆమెకు ఉపాధి

## అధికంగా ఉత్పత్తి అవుతున్న తల్లిపాలను అమ్ముతున్న మహిళ

## ఏడాదికి పదిలక్షలపైనే ఆదాయం

అమెరికాకు చెందిన ఇమిలీ ప్రతీ రోజూ 100 ఔన్సుల మేర అధికంగా ఉత్పత్తి అవుతున్న తన చనుబాలను అమ్ముతోంది. దీంతో ప్రతీ నెలా ఆమెకు 87 వేల రూపాయలు వస్తున్నాయి. సంవత్సరానికి 10 లక్షలు పైనే సంపాదిస్తోంది. ప్రతీ స్త్రీ జీవితంలో తల్లిగా మారే దశ ఓ వరంలాంటిది. అదో మధురానుభూతి. కాన్పు వరకు పడ్డ అన్ని కష్టాలను.. బిడ్డను చూసుకుని మరిచిపోతుంది తల్లి. తన చనుబాలతో బిడ్డ కడుపునింపి ఎంతో సంతోషపడిపోతుంది. అయితే, తల్లిగా మారిన ప్రతీ మహిళకు చనుబాలు రావు. అనేక కారణాల వల్ల కొంతమందిలో చనుబాలు అస్సలు రాకపోగా.. మరికొంతమందిలో అతి తక్కువ మొత్తంలో మాత్రమే వస్తుంటాయి. అలాంటి పరిస్థితుల్లో పశువుల పాలు లేదా డబ్బా పాలు తాపించాల్సి వస్తుంది. తల్లుల్లో అసలు పాలు రాకపోవటం.. తక్కువ పాలు రావటం వంటి సమస్యలే కాకుండా సాధారణం కంటే ఎక్కువ పాలు రావటం కూడా మహిళల్ని వేధిస్తూ ఉంటుంది. అయితే, ఓ మహిళ అధికంగా ఉత్పత్తి అవుతున్న చనుబాలను అమ్ముతూ నెలకు వేల రూపాయలు సంపాదిస్తోంది. అమెరికా, మిన్నిసోటాకు చెందిన 33 ఏళ్ల ఇమిలీ ఎంజర్ కొన్ని రోజుల క్రితమే ఓ బిడ్డకు జన్మనిచ్చింది. ఆమె హైపర్ లాక్టేషన్ సమస్యతో బాధపడుతోంది. ఈ సమస్యలో చనుబాలు అవసరానికి మించి ఎక్కువగా ఉత్పత్తి అవుతూ ఉంటాయి. ఇది తల్లికి, బిడ్డకు మంచిది కాదు. అందుకే ఇమిలీ ఓ ఆలోచన చేసింది. ప్రతీ రోజూ 100 ఔన్సుల మేర అధికంగా ఉత్పత్తి అవుతున్న తన చనుబాలను అమ్ముతోంది. దీంతో ప్రతీ నెలా ఆమెకు 87 వేల రూపాయలు వస్తున్నాయి. సంవత్సరానికి 10 లక్షలు పైనే సంపాదిస్తోంది. పాలను అమ్మడానికి సోషల్ మీడియాను వాడుకుంటోంది. ఫేస్‌బుక్‌లో పోస్టులు పెడుతోంది. అవసరమైన వాళ్లు ఫేస్‌బుక్ ద్వారా ఆమెను సంప్రదిస్తున్నారు. కేవలం చిన్న పిల్లల తల్లిదండ్రులు మాత్రమే కాకుండా.. పిల్లలు లేని వారు కూడా ఆమె పాలను కొంటున్నారు. ఇక, చనుబాలు అమ్మటంపై ఇమిలీ మాట్లాడుతూ..'చనుబాలలో అద్భుతమైన మంచి పోషకాలు ఉన్నాయి. అవి ఏ వయసు వారికైనా ఉపయోగకరమే' అని అంటోంది.

# 55 ఏళ్ల వయస్సులో..
# 17వ బిడ్డకు జన్మనిచ్చిన మహిళ



55 ఏళ్ల వయస్సులో ఒక మహిళ 17వ బిడ్డకు జన్మనిచ్చింది. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఆడ బిడ్డను ప్రసవించింది. ఆమెకు 17వ కాన్పు అని తెలుసుకుని డాక్టర్లు షాకయ్యారు. అయితే 17 మంది సంతానంలో పుట్టిన వెంటనే ఐదుగురు పిల్లలు మరణించారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. లీలావాస్ గ్రామానికి చెందిన కవారా రామ్ భార్య అయిన 55 ఏళ్ల రేఖ జాడోల్ బ్లాక్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 17వ బిడ్డకు జన్మనిచ్చింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు ఆనందంలో మునిగిపోయారు. కాగా, కవారా, రేఖ దంపతులు ఇప్పటి వరకు 17 మంది పిల్లలను కన్నారు. అయితే నలుగురు మగ, ఒక ఆడ బిడ్డ పుట్టిన వెంటనే మరణించారు. ప్రస్తుతం ఈ దంపతులకు 12 మంది పిల్లలు ఉన్నారు. ఏడుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు. 11 మందికి పెళ్లిళ్లు కావడంతోపాటు ఒక్కొక్కరికి ఇద్దరు నుంచి ముగ్గురు పిల్లలు ఉన్నారు. దీంతో 17వ బిడ్డకు రేఖ జన్మనివ్వకముందే ఆమెకు మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు. మరోవైపు కవారా, రేఖ కుటుంబం ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. కవారా స్క్రాప్ డీలర్‌గా పనిచేస్తున్నాడు. తన పిల్లల వివాహాల కోసం వడ్డీకి అప్పు చేసినట్లు అతడు తెలిపాడు. తన పిల్లల్లో ఎవరూ కూడా స్కూల్‌కు వెళ్లి చదువుకోలేదని చెప్పాడు. కాగా, రేఖ తొలుత నాల్గవ కాన్పు అని చెప్పిందని ప్రసవాన్ని పర్యవేక్షించిన డాక్టర్ రోషన్ దరంగి తెలిపారు. అయితే ఆమె ఇప్పటికే 16 మంది పిల్లలకు జన్మనిచ్చినట్లు తెలుసుకుని షాక్ అయినట్లు చెప్పారు. చాలా ప్రసవాల కారణంగా రేఖ గర్భాశయం బలహీనపడిందని అన్నారు. అధిక రక్తస్రావం అయ్యే ప్రమాదం ఉన్నప్పటికీ అదృష్టవశాత్తూ కాన్పు బాగానే జరిగిందని వివరించారు.

# ర్యాగింగ్‌తో జీవితం అంధకారం చేసుకోవద్దు

## విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగాహన కల్పిస్తున్న మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్

విద్యార్థులు ర్యాగింగ్ పేరుతో భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దని మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ అన్నారు. మంచిర్యాల మెడికల్ కళాశాలలో విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సరదా పేరుతో ర్యాగింగ్‌లకు పాల్పడవద్దన్నారు. ర్యాగింగ్ చేసినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ర్యాగింగ్ చేయడం వల్ల కేసులు నమోదై వారి భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దని సూచించారు. యాంటిర్యాగింగ్ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని, కమిటీలో కళాశాల యాజమాన్యంతో పాటు విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులతో కమిటీ ఏర్పాటు చేయాలని ఏ చిన్న సమస్య తలెత్తిన యాజమాన్యానికి సమాచారం అందించాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడినవారితో పాటు యాజమాన్యంపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. దీని కోసం యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులు ఉన్నతమైన స్థాయికి ఎదగాలంటే విద్యపై శ్రద్ధ చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ప్రమోద్‌రావు, కళాశాల యాజమాన్యం, మెడికల్ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



# వివాహేతర బంధంతో గర్భం

## ఇంట్లోనే ప్రసవం- శిశువును చెత్తకుప్పలో పడేసిన వైనం

పేగు తెంచుకుని పుట్టిన శిశువును చెత్త కుప్పలో పడేసింది ఓ తల్లి. భర్తతో విడిపోయాక మరో యువకుడితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. దీంతో ఆ మహిళ గర్భం దాల్చింది. అందరూ ఏమంటారన్న భయంతో ఇంట్లోనే ప్రసవం చేసి, పుట్టిన శిశువును చెత్త బుట్టలో పడేసింది. ఆ నవజాత శిశివును చూసిన ఓ వ్యక్తి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఫలితంగా శిశువు ప్రాణాలు దక్కాయి. ఈ దిగ్భ్రాంతికరమైన ఘటన మహారాష్ట్రలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం, ఛత్రపతీ సంభాజనగర్‌లోని పుండలిక్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఆగస్టు 29న ఉదయం 5 గంటల సమయంలో ఓ యువకుడు పుండలిక్ నగర్ ప్రాంతం గుండా వెళుతున్నాడు. చెత్త కుప్ప దగ్గర కుక్కలు ఒక సంచిని లాగుతుండటం గమనించాడు. ఆ సంచిలోనుంచి శిశువు ఏడుపు వంటి శబ్దం వినిపించింది. వెంటనే అతను కుక్కలను తరిమివేసి సంచి తెరిచి చూసినప్పుడు ఒక నవజాత శిశువు కనిపించింది. ఆ శిశువు ఛాతీపై గాయం కూడా ఉంది. ఆ యువకుడు, ఉదయం వాకింగ్‌కు వచ్చిన కొంతమంది వ్యక్తులతో కలిసి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కూడా తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకుని, పౌరుల సహకారంతో ఆ శిశువును ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్సకు పంపించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తును ప్రారంభించారు. పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా, ఓ మహిళ ఆ శిశువును చెత్త బుట్టలో వేసిందని స్పష్టమైంది. ఆమె వేసుకున్న దుస్తులు, చెప్పులు ఆధారంగా గాలింపు చర్యలు చేపట్టారు. దాదాపు ఏడు నుంచి ఎనిమిది గంటల తర్వాత ఆ మహిళను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తానే ఆ శిశువును చెత్త కుప్పలో పడేసినట్లు పోలీసుల ముందు ఒప్పుకుంది. తన భర్త నుండి విడిపోయి, వేరే యువకుడితో సంబంధం పెట్టుకున్నానని చెప్పింది. ఆ కారణంగానే గర్భవతి అయ్యానని తెలిపింది. ఈ విషయం ఎవరికీ తెలియకుండా ఉండటానికే ఇంట్లోనే ప్రసవించినట్లు పేర్కొంది. తానే స్వయంగా బొడ్డు తాడును కోసి, శిశువును సంచిలో పెట్టి చెత్త బుట్టలో పడేసిందని పోలీసులు ఎదుట మహిళ ఒప్పుకుంది. ఇంట్లోనే ప్రసవించడం వల్ల ఆ మహిళ ఆరోగ్యం కూడా క్షీణించిందని ఎస్ఐ అశోక్ భండారే తెలిపారు. ప్రస్తుతం ఆమె ఘాటి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు వెల్లడించారు. కానీ పోలీసులు దీనిపై సందేహం వ్యక్తం

చేస్తున్నారు. ప్రసవ సమయంలో ఆమెకు తోడుగా మరొకరు ఉండి సహాయం చేసి ఉండవచ్చని భావిస్తున్నారు. ఆ వ్యక్తి ఎవరో కనుగొనడానికి దర్యాప్తు కొనసాగుతోంది.

ఇటీవల కర్ణాటకలో ఇలాంటి ఘటనే జరిగింది. నవజాత శిశువు మృతదేహాన్ని చెత్తబుట్టలో విసిరేసిన ఘటన కర్ణాటకలో కలకలం రేపింది. యలహంకకు చెందిన ఆటో డ్రైవర్ భరత్ (23)కు రెండేళ్ల క్రితం ఓ మైనర్ బాలికతో అతడికి స్నేహం ఏర్పడింది. ఈ పరిచయం కాస్త ప్రేమగా మారింది. తర్వాత మైనర్‌తో శారీరక సంబంధం పెట్టుకున్నాడు. దీంతో మైనర్ గర్భం దాల్చింది. తొమ్మిది నెలలు తర్వాత బిడ్డకు జన్మనిచ్చింది.

# ఫోన్ నెంబర్ బ్లాక్ చేసిందనే కోపంతో నడిరోడ్డుపై గొంతుకోసిన యువకుడు

## గుజరాత్‌లోని భుజ్‌లో దారుణం.. పోలీసుల అదుపులో నిందితుడు

గుజరాత్‌లోని భుజ్‌లో దారుణం జరిగింది. సోషల్ మీడియాలో తనను బ్లాక్ చేసిందనే కోపంతో 20 ఏళ్ల అమ్మాయిని, పక్కింటి అబ్బాయి హత్య చేశాడు. దీనితో పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు మోహిత్ సిద్ధపారా తన స్నేహితుడితో కలిసి బాధిత అమ్మాయి చదివే కాలేజీకు వెళ్లాడు. కాలేజీ బయట అమ్మాయితో గొడవపడ్డాడు. తరువాత పట్టరాని కోపంతో అమ్మాయి గొంతు కోశాడు. ఆపడానికి ప్రయత్నించిన స్నేహితుడిని కూడా కత్తితో గాయపరిచాడు. తరువాత అక్కడి నుంచి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన బాధితురాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. ఈ ఘటనపై కచ్ ప్రాంతంలో తీవ్ర ఆందోళన, ఆగ్రహం వ్యక్తం అయ్యాయి. రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడు మోహిత్‌ను అదుపులోకి తీసుకుని, అతనిపై హత్య కేసు నమోదు చేశారు. “బాధిత విద్యార్థిని (20) ఓ కళాశాలలో బీసీఏ చదువుతోంది. గాంధీదామ్‌లోని భరత్‌నగర్‌లో ఆమె కుటుంబం ఉంటోంది. వారి ఇంటి పక్కనే నిందితుడు మోహిత్ ఉంటాడు. బాధితురాలు భుజ్‌లోని ఓ హాస్టల్‌లో ఉండి చదువుకుంటోంది. ఇరుగుపొరుగువారు కావడంతో వారిద్దరికి ముందు నుంచి పరిచయం ఉంది. గతంలో వారిద్దరి మధ్య ప్రేమ సంబంధం ఉండేదని తెలుస్తోంది. కానీ తరువాత వారిద్దరూ దూరయ్యారు. తల్లి సలహా మేరకు సదరు బాధితురాలు మోహిత్ నంబర్‌ను బ్లాక్ చేసింది. దీనిని మోహిత్ తట్టుకోలేకపోయాడు. కాలేజీ నుంచి ఆ

అమ్మాయి బయటకు రాగానే, ఆమెతో గొడవ పెట్టుకున్నాడు. ఆ అమ్మాయి తనకు ఇకపై ఎలాంటి సంబంధం అక్కర లేదని గట్టిగా చెప్పింది. దీనితో అతను కోపాన్ని ఆపుకోలేకపోయాడు. అకస్మాత్తుగా కత్తి తీసి ఆమె గొంతును కోశాడు. అడ్డుకోబోయిన స్నేహితుడిపై కూడా దాడి చేసి, అతని వీపుపై పొడిచాడు. తరువాత బాధితురాలిని, తన స్నేహితుడిని అక్కడే వదిలేసి బైక్‌పై పారిపోయాడు. వెంటనే బాధితులు ఇద్దరినీ భుజ్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. ఆమెను కాపాడడానికి ఎంత ప్రయత్నించినప్పటికీ, ఫలితం లేకపోయిందని, తీవ్రంగా గాయపడిన బాధితురాలు మరుసటి రోజు ఉదయం మరణించిందని వైద్యులు తెలిపారు.

# గంజాయి మత్తులో మెడికల్ స్టూడెంట్స్

## పరీక్షలో 9 మందికి పాజిటివ్

## హైదరాబాద్ రిసాలబజార్‌లో విక్రేత పట్టివేత

## 24 మందిని పరీక్షించగా 9 మందికి పాజిటివ్

వైద్య విద్యార్థులూ గంజాయికి బానిసలవుతున్నారు. హైదరాబాద్‌లోని రిసాలబజార్ కేంద్రంగా సాగుతున్న మత్తు దందాను తెలంగాణ 'ఈగల్' పోలీసులు ఛేదించారు. ఈ వ్యవహారంలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. దీనిలో ఇద్దరు పెడ్లర్లతో పాటు 81 మంది వినియోగదారులపై కేసులు నమోదు చేశారు. ఈ కేసులో అదుపులోకి తీసుకున్న నిందితుల్లో నగరంలోని ఓ వైద్య కళాశాలకు చెందిన కొంతమంది వైద్య విద్యార్థులు ఉన్నారు. కొందరిని పరీక్షించగా పాజిటివ్‌గా తేలడం, వారిలో ఇద్దరు యువతులు ఉండటం గమనార్హం. హైదరాబాద్‌లోని బొల్లారం రిసాలబజార్‌లోని పాఠశాల మైదానానికి తరచుగా ఓ యువకుడు ద్విచక్ర వాహనంపై అక్కడి వినియోగదారులకు గంజాయి అమ్ముతున్నట్లు హైదరాబాద్ ఈగల్ విభాగానికి సమాచారం అందింది. ఈ నేపథ్యంలో ఇటీవల అక్కడ పోలీసులు వారి కోసం మాటువేశారు. ఈ క్రమంలోనే ఓ బైక్‌పై అనుమానాస్పదంగా వచ్చిన యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. అతడి వద్ద 2 కిలోల గంజాయి దొరికింది. నిందితుడిని రిసాలబజార్‌కు చెందిన అరాఫత్ అహ్మద్ ఖాన్ (23)గా గుర్తించారు. ఇతడు రెండు సంవత్సరాలుగా కర్ణాటకలోని

బీదర్‌లో జరీనా బాను వద్ద గంజాయి కొని నగరంలో అమ్ముతున్నట్లు తేలింది. అరాఫత్ అహ్మద్ ఖాన్ ఇచ్చిన సమాచారంతో ఈగల్ బృందాలు జరీనా బానును ఇటీవల బీదర్‌లో అదుపులోకి తీసుకున్నాయి. ఆమె బ్యాంకు అకౌంట్‌ను పరిశీలించగా, సంవత్సరం కాలంగా జరిగిన రూ.1.5 కోట్ల లావాదేవీలు వెలుగులోకి వచ్చాయి. ఇందులో రూ.26 లక్షలు హైదరాబాద్‌కు చెందిన 51 మంది గంజాయి వ్యాపారులు చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. హైదరాబాద్‌లో నమోదైన రెండు గంజాయి కేసుల్లో ఆమె నిందితురాలిగా ఉంది. ఆమె వద్ద అరాఫత్‌ఖాన్ రూ.6 లక్షల లావాదేవీలు జరిపాడు. అరాఫత్ అహ్మద్ ఖాన్ వద్ద దాదాపు 100 మంది గంజాయి కొంటున్నట్లు ఈగల్ డీఎస్పీ నర్సింగ్‌రావు, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు విచారణలో గుర్తించారు. ఇందులో ఓ వైద్య కళాశాలకు చెందిన 32 మంది విద్యార్థులు ఉన్నారు. వారిలో 24 మందిని పరీక్షించగా ఇద్దరు యువతులు సహా 9 మందికి పాజిటివ్ వచ్చింది. వీరంతా కళాశాల వసతి గృహంలో ఉంటున్నారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చి డీ-అడిక్షన్ కేంద్రానికి పంపించారు. మిగిలిన 8 మంది గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు.



# మహిళల సాధికారతకు పురుషాధిక్యతే అడ్డు

# బాధిత మహిళలకు అండగా ఉండాలి

## జాతీయ మహిళా కమిషన్ సభ్యులు అర్చనా మజుందార్

వివిధ రకాల సమస్యలతో సతమతమయ్యే బాధిత మహిళలకు అధికార యంత్రాంగం అండగా నిలవాలని, తగిన విధంగా తోడ్పాటు అందించాలని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చనా మజుందార్ పేర్కొన్నారు. వారు అందించే వినతులు, పోలీసు కేసుల విషయంలో చొరవ చూపాలని, పరిపాలనాపరమైన, న్యాయపరమైన సేవలను స్నేహపూర్వక వాతావరణంలో అందించాలని సూచించారు. క్లిష్టమైన పరిస్థితుల్లో భరణం వచ్చేలా, స్వయం ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 'జన సునవాయి' పేరుతో విశాఖ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో బాధిత మహిళలు అందించిన పలు ఫిర్యాదులను ఆమె పరిశీలించి, పై విధంగా స్పందించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ, సభ్యులు జయశ్రీ, జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, సిపి శంఖబ్రత బాగ్చీ, జెసి మయూర్ అశోక్ పాల్గొన్నారు. తొలుత బాధితుల సమస్యలను అర్చనా మజుందార్ విన్నారు. కేసు పూర్వాపరాలను, తాజా స్థితి, ఇప్పటి వరకు తీసుకున్న చర్యల గురించి సంబంధిత పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. సుదీర్ఘంగా పెండింగ్‌లో ఉన్న అంశాలపై అధికారులు మరింత చొరవ చూపాలని సూచించారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన మహిళలు 54 వినతులను ఆమెకు అందజేశారు.



# గాజాలో ఆగని ఆకలి చావులు..
# 290 మంది మృతి

నిత్యావసర వస్తువుల సరఫరాపై ఇజ్రాయెల్ ఆంక్షలు విధించిన నేపథ్యంలో గాజాగా ఆకలి చావులు కొనసాగుతున్నాయి. ఆకలి కారణంగా మరణించిన వారి సంఖ్య 290కు చేరుకొంది. వీరిలో 114 మంది పిల్లలు ఉన్నారు. ఈ మేరకు గాజాలోని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన



ప్రకటనలో వెల్లడించింది. ది గ్లోబల్ హంగర్ మానిటర్, ఇంటిగ్రేటెడ్ ఫుడ్ సెక్యూరిటీ ఫేజ్ క్లాసిఫికేషన్ సైతం గాజాలోని కరువు పరిస్థితులను ఇప్పటికే నిర్ధారించింది. అందులో భాగంగా ఉత్తర గాజా గవర్నరేట్ పరిధిలోని బీట్ హనూన్, జబాలియా తదితర నగరాల్లోని పరిస్థితులు దాదాపుగా అలాగే ఉన్నాయని.. కొన్ని ప్రదేశాల్లో అంతకంటే దారుణంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఉత్తర గాజాలో ఆహార భద్రతపై తగినన్ని వివరాలు తమ వద్ద లేదని పేర్కొంది. కానీ ఈ ప్రాంతానికి అత్యవసరంగా ఆహారాన్ని అందించాల్సిన ఆవశ్యకత మాత్రం ఉందని స్పష్టం చేసింది. ఇక దక్షిణ గాజాలోని రఫా గవర్నరేట్‌పై తాము విశ్లేషణలు చేయలేదని ఈ సంస్థ వివరించింది. అదీకాక ఈ ప్రాంతంలో ఇజ్రాయెల్ విస్తృతమైన సైనిక కార్యకలాపాలు కారణంగా.. విధ్వంసం అధికంగా ఉందని తెలిపింది. ఇక్కడ జనాభా సైతం అంతగా లేదని స్పష్టం చేసింది. ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీ నాటికి గాజా గవర్నరేట్ పరిధిలో నివసిస్తున్న వారిలో 30 శాతం మంది మాత్రమే ఉన్నారని చెప్పింది. వీరంతా ఫేజ్ 5 స్థాయి ఆహార లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని

వివరించింది. అలాగే ఆ ప్రాంతంలోని వివిధ గవర్నరేట్ల పరిధిలోని ప్రజలు ఫేజ్ 4 అత్యవసర పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లు తెలిపింది. 2023, అక్టోబర్ 7వ తేదీన గాజాపై ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించిన నాటి నుంచి నిన్న మొన్నటి వరకు మరణించిన వారి సంఖ్య 62,004కు చేరింది. అలాగే ఈ యుద్ధం కారణంగా 156,000 మంది గాయపడ్డారు.

## ఆహారం కోసం చూస్తుండగా దాడి - 53 మంది మృతి

గాజాలో ఆకలి కేకలపై ఆందోళన వ్యక్తం అవుతున్న నేపథ్యంలో ఇజ్రాయెల్ సైన్యం కీలక ప్రకటన చేసింది. గాజాలో విమానాల ద్వారా సరకుల్ని జారవిడుస్తామని తెలిపింది. అయితే కచ్చితంగా ఎక్కడ జారవిడిచేదీ పేర్కొనలేదు. ఐక్యరాజ్యసమితి ఆహార సరఫరా కాన్వాయ్‌ల కోసం మానవతా కారిడార్లు ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. గాజాలో ఇటీవల ఆకలి మరణాల సంఖ్య భారీగా పెరిగిన నేపథ్యంలో ఇజ్రాయెల్ ఈ మేరకు ప్రకటన చేసింది. ఇటీవల గాజాలో మానవతా సాయం కోసం వేచి చూస్తున్న వారిపై పలుమార్లు కాల్పులు జరిగాయి. ఈ ఘటనల్లో వందల మంది గాజా వాసులు మృతిచెందారు. ఈ మరణాలకు ఇజ్రాయెల్ కారణమని గాజా అధికారులు ఆరోపించారు. ఈ ఘటనలపై ఇజ్రాయెల్‌పై మిత్రదేశాలతో పాటు అంతర్జాతీయంగా తీవ్ర విమర్శలు రావడంతో సరకుల్ని జారవిడవాలనే నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

ఆహారం, సహాయం కోసం ఎదురుచూస్తున్న పాలస్తీనీయులపై ఇజ్రాయెల్ మళ్లీ విరుచుకుపడింది. నిరాయుధులైన గాజా వాసులపై చేసిన దాడిలో దాదాపు 53 మంది మరణించారు. గాజాలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన వైమానిక దాడులు, తుపాకీ కాల్పుల్లో 53 మంది పాలస్తీనీయులు మృతి చెందారని స్థానిక ఆరోగ్యశాఖ అధికారులు వివరించారు. మృతుల్లో అధిక సంఖ్యాకులు జికిం క్రాసింగ్ వద్ద ఆహార ట్రక్కుల కోసం వేచి ఉన్నవారేనని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. అయితే, సామాన్యులపై జరిగిన కాల్పులపై స్పందించడానికి ఇజ్రాయెల్ నిరాకరించింది.

## గాజాపై ఐక్యరాజ్యసమితి ఆందోళన

మరోవైపు గాజాలో తీవ్ర క్షామ పరిస్థితులు నెలకొన్నాయని, పోషకాహార లేమి వల్ల ఎందరో మృత్యువాత పడుతున్నారని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. శాంతి చర్చల్లో పాల్గొంటున్న తమ ప్రతినిధుల్ని అమెరికా, ఇజ్రాయెల్‌లు ఉపసంహరించుకోవడం వల్ల గాజాలో కాల్పుల విరమణ చర్చలు నిలిచిపోయాయి. హమాస్‌తో చర్చలు జరపడానికి బదులు ఇతర ప్రత్యామ్నాయాలను తమ ప్రభుత్వం పరిశీలిస్తోందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతాన్యాహు వెల్లడించారు. దీంతో ఇరుదేశాల చర్చలపై అనిశ్చితి నెలకొంది.

# స్మార్ట్‌ఫోన్‌లో పిల్లలు గేమ్ ఆడితే తల్లిదండ్రులకు రూ.3000 జరిమానా

## ఛత్తీస్‌గఢ్‌లోని గహీరాభేడీ గ్రామపెద్దల తీర్మానం

స్మార్ట్ ఫోన్ ఇది లేని ఇల్లు లేదు. తెలియని పిల్లాడు లేడు. చిన్నతనం నుంచే ఫోన్‌ను ఆపరేట్ చేయడం, అందులో గేమ్స్ ఆడడం పిల్లలకు పరిపాటిగా మారింది. కొంతమంది పిల్లలైతే ఫోన్ ఇవ్వకపోతే భోజనం చేయనని మారాం చేస్తుంటారు. మొబైల్‌కు బానిసలవడం వల్ల పిల్లల ఎదుగుదలలో సమస్యలు వస్తాయని డాక్టర్లు పదేపదే చెబుతున్నా తల్లిదండ్రులు పట్టించుకోవడం లేదు. అయితే ఈ సమస్యకు విన్నూతమైన ఆలోచన చేశారు ఓ గ్రామస్తులు. ఎవరైన పిల్లలు ఫోన్‌లో గేమ్ ఆడితే వారి తల్లిదండ్రులకు రూ.3000 జరిమానా విధిస్తామని అక్కడి గ్రామపెద్దలు తీర్మానం చేశారు. అలాగే సమాచారం ఇచ్చిన వారికి బహుమతిగా రూ.1000 అందజేస్తామని ప్రకటించారు. దీంతో ఇప్పుడు ఆ గ్రామంలో చాలా వరకు పిల్లల ఫోన్ వాడకం తగ్గింది. రాజ్‌నంద్‌గావ్ జిల్లాలోని ఘురియా బ్లాక్‌లోని గహీరాభేడీ గ్రామ పంచాయతీ పెద్దలు మొబైల్‌లో గేమ్ ఆడే పిల్లలను కట్టడి చేయాలని నిర్ణయించారు. పిల్లల నుంచి ఈ వ్యసనాన్ని దూరం చేయాలని భావించారు. గ్రామంలోని చాలా మంది పిల్లలు మొబైల్ గేమ్‌లతో సమయం వృథా చేసుకోవడం, ఫోన్‌లకు అతుక్కుపోవడం, రోజంతా శారీరక కార్యకలాపాల్లో పాల్గొనకపోవడం వంటివి పెద్దలు గమనించారు. ఈ వ్యవసానికి చెక్ పెట్టేందుకు విన్నూతమైన ఆలోచన చేశారు. పిల్లులు సెల్‌ఫోన్లకు బానిసలు కావడంతో చిన్నారుల పాత్ర ఎంత ఉందో, వారి తల్లిదండ్రుల పాత్ర కూడా అంతే ఉందని భావించారు. ఈ క్రమంలో పిల్లలు మొబైల్‌కు బానిసలుగా మారకుండా నిరోధించడానికి గ్రామపెద్దలంతా ఓ చోట సమావేశమై జరిమానా విధించాలని నిర్ణయం తీసుకున్నట్లు గ్రామ సర్పంచ్ బెద్‌బాయి తెలిపారు. చదువు, ఇతర కార్యకలాపాల వైపు పిల్లలు దృష్టిని మళ్లించేందుకు ఈ చొరవ తీసుకున్నట్లు సర్పంచ్ తెలిపారు. వారం క్రితమే ఈ నిర్ణయాన్ని అమలు చేయడం ప్రారంభించామని, దీని ప్రయోజనాలు ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నాయని తెలిపారు. ఎవరైనా గేమ్? ఆడినట్లు తెలిస్తే వారి తల్లిదండ్రులకు రూ. 3000 జరిమానా విధిస్తామని ప్రకటించినట్లు తెలిపారు. అలాగే ఎవరైతే సమాచారం ఇస్తారో వారికి రూ.1000 బహుమతిగా ఇస్తామని కూడా చెప్పామన్నారు.

# గల్ఫ్‌లో ఐదుగురు తెలంగాణ ప్రవాసీలకు రెండేళ్ల జైలు.. దేశ బహిష్కరణ

### మరో 19మంది ప్రవాస భారతీయులకూ అదే శిక్ష
### ఆహార ప్యాకెట్లపై గడువు తేదీ మార్చినందుకు బహ్రెయిన్ కోర్టు తీర్పు



సంస్థ యజమానితో కలిసి ఆహార ప్యాకెట్లపై గడువు ముగింపు తేదీలను మార్చడం ద్వారా మోసాలకు పాల్పడ్డారనే కేసులో ఐదుగురు తెలంగాణ ప్రవాసీలు జైలు పాలయ్యారు. న్యాయస్థానం వీరికి రెండేళ్ల జైలు శిక్ష, దేశ బహిష్కరణ విధించింది. అలాగే, ఇద్దరు అరబ్బు యజమానులు, ఓ భారతీయ మేనేజరు సహా 19 మంది ప్రవాస భారతీయులు కూడా జైలు శిక్ష పడిన వారిలో ఉన్నారు. బహ్రెయిన్‌లో ఆహార పదార్థాలను సరఫరా చేసే ఓ ప్రముఖ సంస్థలో నిజామాబాద్‌కు చెందిన ముగ్గురు.. జగిత్యాల, సిరిసిల్ల జిల్లాలకు చెందిన ఒక్కొక్కరు పని చేస్తున్నారు. అయితే, ఇదే సంస్థలో పని చేయడానికి వచ్చిన ఉద్యోగి ఒకరు అందులో పని విషయమై వివాదం ఏర్పడడంతో సంస్థ కార్యకలాపాలను వీడియో రికార్డింగ్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అధికారులు సంస్థ గిడ్డంగులపై దాడులు చేసి ప్యాకింగ్ చేసిన వివిధ రకాల ఆహార పదార్థాల ప్యాకెట్లపై గడువు ముగిసిన తేదీలను మారుస్తూ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారని బహ్రెయినీ జాతీయులైన అరబ్బు యజమానులతో సహా మొత్తం 29 మందిని అరెస్టు చేశారు. కానీ, సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో న్యాయస్థానం ఏడుగురు భారతీయులను విడుదల చేయగా.. మిగిలిన 22 మందికి రెండేళ్ల జైలు శిక్షలు విధించింది. ప్రవాస భారతీయుల జైలు శిక్షను రద్దు చేయాలని బహ్రెయిన్‌లోని సామాజిక కార్యకర్త కోటగిరి నవీన్, టీపీసీసీ ఎన్నారై సెల్ కన్వీనర్ సింగిరెడ్డి నరేశ్‌రెడ్డిలు ప్రయత్నాలు చేస్తున్నారు.

### రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన భార్యను బైక్‌పై తీసుకెళ్లిన భర్త

# కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో కేసు ఛేదించిన పోలీసులు

## ఏ ఆధారం లేకపోయినా మరణానికి కారణమైన లారీని పట్టుకున్న నాగపూర్ పోలీసులు



మహారాష్ట్రలో రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన భార్య మృతదేహాన్ని బైక్‌పైనే తీసుకెళ్లిన కేసును పోలీసులు ఛేదించారు. అది కూడా కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో నిందితుడిని పట్టుకున్నారు. వీరి బైక్‌ను ఢీకొట్టిన ట్రక్కును ఏఐ సాంకేతికతో గుర్తించి నిందితుడిని అరెస్ట్ చేశారు పోలీసులు. మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌కు చెందిన అమిత్ యాదవ్ తన భార్యతో కలిసి ఆగస్టు 10న లోనారా నుంచి కరణ్‌పుర్‌కు వెళ్తున్నారు. నాగపూర్ - జబల్‌పుర్ జాతీయ రహదారి మీద ఓ ట్రక్కు వారిని ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నుంచి పడిన మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించడానికి అమిత్ వేడుకున్నా ఎవరూ రాలేదు. మరోదారి లేక అమిత్ తన బైక్ వెనక మృతదేహాన్ని కట్టి అదే జాతీయ రహదారి మీదుగా తమ గ్రామానికి తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నాడు. ఆ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కేసు నమోదు చేసుకున్న నాగపూర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ట్రక్కు గురించి అమిత్‌ను ప్రశ్నించగా ఎరుపు రంగు ట్రక్కు అని మాత్రమే గుర్తుందని తెలిపారు. అమిత్ ఇచ్చిన ఆధారంతో సీసీటీవీలను పరిశీలించడం ప్రారంభించారు. మూడు వేర్వేరు టోల్‌గేట్ నుంచి నాలుగు గంటల సీసీటీవీ ఫుటేజీని సేకరించారు. ఏఐ అల్గారిథంతో సాయంతో రూపొందించిన మార్వెల్ (మహారాష్ట్ర అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ అండ్ విజిలెన్స్ ఫర్ ఎన్‌హాన్స్‌డ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) సాంకేతికతను ఉపయోగించి ఎరుపు రంగు ట్రక్కులను గర్తించారు. ఆ తర్వాత వాహన వేగం ఆధారిత గణన ద్వారా ప్రమాదానికి ఏ వాహనం కారణమై ఉండవచ్చు అనే వివరాలను సేకరించారు. ఏఐ ఇచ్చిన సమాచారంతో 700 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎరుపు రంగు ట్రక్కును స్వాధీనం చేసుకుని, డ్రైవర్ సత్యపాల్ రాజేంద్రను అరెస్ట్ చేసినట్లు నాగపూర్ ఎస్పీ హర్ష్ ఏ పొద్దార్ తెలిపారు.

# 100% డిజిటల్ అక్షరాస్యత సాధించిన కేరళ

దేశంలో వంద శాతం అక్షరాస్యత సాధించిన తొలి రాష్ట్రంగా రికార్డులకెక్కిన కేరళ మరో గొప్ప ఘనత సాధించింది. దేశంలోనే తొలి డిజిటల్ అక్షరాస్యత సాధించిన రాష్ట్రంగా నిలిచింది. వయసు, విద్యార్హత, ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా కేరళ ప్రభుత్వం ప్రతి పౌరుడిని డిజిటల్ అక్షరాస్యుడిని చేసేందుకు 'డిజి-కేరళం ప్రాజెక్టు'కు శ్రీకారం చుట్టింది. కరోనా లాక్‌డౌన్ సమయంలో కేరళలోని పుల్లంపారా గ్రామ పంచాయతీలో డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్టుగా మొదలుపెట్టారు. దేశంలోనే డిజిటల్ అక్షరాస్యత సాధించిన తొలి పంచాయతీగా అది రికార్డులకు ఎక్కింది. దీనితో పుల్లంపారా గ్రామం స్ఫూర్తిగా తీసుకుని విజయన్ సర్కార్ 2022లో 'డిజి కేరళ ప్రాజెక్టు'ను చేపట్టింది.



ప్రజలు డిజిటల్ సేవలు, ఆన్‌లైన్ చెల్లింపులు, అధికారిక దస్త్రాలను స్వయంగా పొందటమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును అమలుచేశారు. స్థానిక ప్రభుత్వాలు అందించే సేవలను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చేందుకు ఈ ప్రాజెక్టు దోహదం చేసింది. డిజిటల్ సేవలకు ఏ ఒక్క పౌరుడు దూరం కాకూడదన్న లక్ష్యంతో డిజిటల్ అక్షరాస్యతపై ప్రజలకు శిక్షణ ఇచ్చారు. డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా 14ఏళ్లు అంతకంటే ఎక్కువ వయసు వారిని గుర్తించి శిక్షణ ఇచ్చారు. స్మార్ట్‌ఫోన్ వాడకం, ఇంటర్నెట్ బ్రౌజింగ్, ఆడియో, వీడియో కాల్స్ చేయటం, ఫొటోలు, వీడియోలు డౌన్‌లోడ్ చేయటం, యూట్యూబ్‌లో వీడియోలు చూడటం, వీడియోలు చేయటం సహా సామాజిక మాధ్యమాల వాడకం, ఈ-సేవలు, బ్యాంకింగ్ కార్యకలాపాలపై కనీస అవగాహన కల్పిస్తూ తర్ఫీదునిచ్చారు.

డిజిటల్ లిటరసీ సాధించిన పుల్లంపారాకు చెందిన 73ఏళ్ల సరసు ఏకంగా 'సరసు వరల్డ్' పేరుతో సొంత యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తోంది. సులభంగా రీల్స్ చేస్తూ తాను వినోదం పొందటంతోపాటు, ఇతరులకు పంచుతోంది. 103 ఏళ్ల కరుణాకర పనిక్కర్, 74 ఏళ్ల ఆయన కుమారుడు రాజన్ వాట్సప్ ద్వారా వార్తలను వీక్షిస్తూ అప్‌డేట్ అవుతున్నారు. 64 ఏళ్ల పద్మినీ సామాజిక మాధ్యమాల్లో యాక్టివ్‌గా ఉంటూ బిజీగా మారింది. ఒకప్పుడు ఫీచర్ ఫోన్‌తో కాల్స్ మాత్రమే చేయగలిగిన 105 ఏళ్ల అబ్దుల్లా, ఇప్పుడు యూట్యూబ్ ద్వారా వినోదం పొందుతున్నాడు. తనను డిజిటల్ అక్షరాస్యుడిగా మార్చిన డిజి-కేరళ వాలంటీర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపాడు.

కేరళలోని 83 లక్షల కుటుంబాలకు చెందిన కోటిన్నర మందిని సర్వేచేశారు. దాదాపు 21,88,398 మందికి శిక్షణ ఇవ్వటానికి గుర్తించగా, వారిలో 21,87,966 మంది శిక్షణ పూర్తి చేసుకున్నారు. వారిలో 90ఏళ్లు, ఆ పైబడినవారు 15వేల మందికిపైగా ఉన్నారు. వారికి స్మార్ట్‌ఫోన్ వాడకం, ఆన్‌లైన్ బ్యాంకింగ్, ఈ-గవర్నెన్స్ వంటి డిజిటల్ స్కిల్స్ నేర్పించారు. డిజిటల్ అక్షరాస్యత పరీక్షలో వారు ఉత్తీర్ణులైనట్లు అధికారులు తెలిపారు. తొలి ప్రయత్నంలో ఉత్తీర్ణులు కాని వారికి మళ్లీ శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. అందుకోసం ప్రత్యేక వెబ్ పోర్టల్‌తోపాటు మొబైల్ అప్లికేషన్‌ను అభివృద్ధి చేశారు.


కేరళ సర్కార్ చేపట్టిన డిజిటల్ అక్షరాస్యత ప్రాజెక్టు విజయవంతం కావటంలో 2.57లక్షల మందితో కూడిన వాలంటీర్ల బృందం కీలకపాత్ర పోషించింది. కేరళ సర్కార్ సాధించిన ఈ విజయం జాతీయస్థాయిలో బెంచ్‌మార్క్‌గా నిలిచింది. విద్య, డిజిటల్ పాలనలో పినరయి విజయన్ ప్రభుత్వం మరింత బలోపేతమైంది. విద్య విషయంలో మిగతా రాష్ట్రాలకు ఆదర్శప్రాయంగా నిలిచింది.

# అక్కడ వరకట్నం నిషేధం

## వరుడితో సమానంగా వధువుకు గౌరవం

## పెళ్లి ఖర్చులు కూడా పెళ్లికుమారుడివే!

కూతురి పెళ్లంటే తల్లిదండ్రులకు అయ్యే ఖర్చు అంతా ఇంతా కాదు. వరకట్నం, ఆభరణాలు సహా ఇతర సామాగ్రిని వరుడు కుటుంబ సభ్యులకు ఇవ్వాల్సి ఉంటుంది. మొత్తం పెళ్లి తంతు అంతా పూర్తయ్యేసరికి వధువు తల్లిదండ్రులకు ఖర్చు తడిసి మోపెడవుతోంది.




అయితే ఝార్ఖండ్‌లోని సంతాలి గిరిజన తెగకు చెందిన పెళ్లికొడుకులు వరకట్నం తీసుకోరు. బదులుగా తిరిగి వధువు కుటుంబానికి కొంత నగదు ఇస్తారు. ఝార్ఖండ్ గిరిదిహ్ జిల్లాలోని సంతాలి గిరిజన తెగకు చెందినవారు వివాహ సమయంలో వరకట్నం తీసుకోరు. అనేక ఇతర జాతుల్లా కాకుండా, ఈ గిరిజన తెగ ప్రజలు ఏ రూపంలోనైనా వరకట్నాన్ని స్వీకరించరు. ఇంకా చెప్పాలంటే వరకట్నాన్ని గట్టిగా తిరస్కరిస్తారు. దీంతో ప్రకృతిని ఆరాధించే ఈ గిరిజన సమాజం ఎల్లప్పుడూ ఇతర వర్గాలకు ప్రేరణగా నిలుస్తోంది. అలాగే మహిళలకు గౌరవం ఇవ్వడంలో స్ఫూర్తిగా ఉంటోంది. మహిళలను గౌరవించడం, వివాహ సమయంలో వారిని పురుషులతో సమానంగా చూడడమే ఈ సంప్రదాయానికి మూలస్తంభంగా చెప్పొచ్చు. "వివాహం నిశ్చయమైన సమయంలో లేదా తర్వాత వరుడి వైపు వాళ్లు ఎటువంటి వరకట్నం డిమాండ్ చేయరు. అబ్బాయి ఎంత గొప్ప జాబ్ చేసినా, ఉన్నత స్థితిలో ఉన్నా అతడు వరకట్నం డిమాండ్ చేయడు. ఎవరైనా

కట్నం డిమాండ్ చేస్తే వారు సామాజిక బహిష్కరణకు గురవుతారు. గిరిజన సమాజంలో వరకట్నానికి చోటులేదు. వరకట్నానికి వ్యతిరేకంగా ఈ బలమైన వైఖరి కేవలం చట్టపరమైన అంశం మాత్రమే కాదు. ఇది మా సాంస్కృతిక, సామాజిక నీతిలో లోతుగా పాతుకుపోయింది. మా సమాజంలో కట్నం తీసుకోము. బదులుగా అమ్మాయి తల్లిదండ్రులను గౌరవించే సంప్రదాయం ఉంది. ఇక్కడ వివాహం సమయంలో అబ్బాయి వైపు వారు అమ్మాయి తండ్రికి రూ. 12 ఇస్తారు. తండ్రి తన కుమార్తెను చిన్నప్పటి నుంచి పెంచినందుకు ఇదొక గౌరవ చిహ్నం. వధువు చిన్నతనం నుంచి పెంచినందుకు ఆమె తల్లికి ఒక చీర ఇస్తారు. అలాగే అమ్మమ్మ కూడా ఒక చీరను అందిస్తారు" అని సంతాలి గిరిజన తెగ వారు తెలిపారు. వధువు సోదరుడికి పెళ్లి సమయంలో వరుడు తరఫువారు వ్యవసాయం చేసుకునేందుకు ఒక జత ఎద్దులను ఇచ్చే సంప్రదాయం ఉంది. అబ్బాయి తరపు వారు ఒక జత ఎద్దులను ఇవ్వలేకపోతే, ఒక ఎద్దునైనా ఇస్తారు. ఒక ఎద్దు ఇవ్వలేకపోతే, ఒక రూపాయి ఇచ్చినా సరిపోతుంది. దీనిని తిక్లా-డంగర అంటారు. అదే విధంగా, పెళ్లికి ముందు బరాత్‌కు అయ్యే ఖర్చును వరుడే భరించాలి. అందుకు వధువు కుటుంబ సభ్యులకు ఏం సంబంధం ఉండదు. వధువు తరఫువారు బరాత్ బస కోసం ఏర్పాట్లు చేస్తారు.

దీంతో పాటు ఒక కుండ, మూడు పాత్రల్లో నీరు ఇస్తారు. విందును వరుడు తరఫువారే ఏర్పాటు చేసుకోవాలి. క్షురకుడు, బట్టలు ఉతికేవాడు కూడా బరాత్‌తో వస్తాడు. క్షురకుడి సమక్షంలో వధువు సోదరి లేదా అత్త, అమ్మమ్మ వరుడికి మంగళస్నానం చేయిస్తారు. అప్పుడు అమ్మాయి తరపు వారు అబ్బాయికి కొత్త బట్టలను ఇస్తారు. ఆ సమయంలో క్షురకుడికి, ఇతర సహాయకులకు స్నానం చేయించడానికి, వరుడి బట్టలు శుభ్రం చేయడానికి రూ.7.50 లభిస్తుంది. ప్రధాన వివాహ వేడుక పూర్తయిన తర్వాత చుమావాన్ అనే ఆచారాన్ని నిర్వహిస్తారు. వివాహం పూర్తయిన తర్వాత వధూవరులు చుమావాన్ కోసం కూర్చున్నప్పుడు, బంధువులు నగదుతో పాటు పాత్రలను అందిస్తారు. అమ్మాయి వైపు వారికి నగదు ఇచ్చేస్తారు. అమ్మాయితో పాటు పాత్రలను అబ్బాయి ఇంటికి పంపిస్తారు. సంతాలి గిరిజన సమాజంలో వరకట్న వ్యవస్థ లేదని ఝార్ఖండ్ ముక్తి యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోలేశ్వర్ సోరెన్ చెబుతున్నారు. అమ్మాయి తరపు వారు వివాహ ఊరేగింపును చేయలేకపోతే, వరుడు కుటుంబ సభ్యులు సాయం చేస్తారని తెలిపారు. వరుడు తరపు వారు వివాహ ఊరేగింపునకు ఆహారాన్ని ఏర్పాటు చేస్తారని వెల్లడించారు. గిరిజన సమాజంలో మహిళలు, పురుషులకు సమాన హక్కులు ఉంటాయన్నారు.

# మంత్రాల నెపంతో వృద్ధ దంపతులపై దారుణం

## మూత్రం తాగించి, గుండు కొట్టించి చిత్రహింసలు

## భర్త మృతి - భార్య పరిస్థితి విషమం.. బీహార్‌లో అమానవీయ ఘటన

సాంకేతికత ఇంతలా అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లో కూడా ప్రజలు ఇంకా మూఢ నమ్మకాలను నమ్ముతున్నారు. తాజాగా మంత్రాల నెపంతో వృద్ధ దంపతులను దారుణంగా చిత్ర హింసలు పెట్టారు. ఈ అమానవీయ ఘటన బీహార్ నవాదా జిల్లాలో వెలుగు చూసింది. ఈ ఘటనలో భర్త మరణించగా, భార్య పరిస్థితి విషమంగా ఉంది. హిసువా పోలీస్ స్టేషన్ పరిధిలోని 70ఏళ్ల వృద్ధుడిని అతడి భార్యను మంత్రాల చేస్తున్నారనే కారణంతో దారుణంగా ప్రవర్తించారు. వారికి గుండు కొట్టి తలపై నిమ్మకాయ రసం పోశారు. అనంతరం వారి మెడలో చెప్పుల దండ వేసి ఊరంతా తిప్పారు. చివరికి హద్దులు మీరి అత్యంత దారుణంగా వారికి మూత్రం తాగించి రాడ్లు, కట్టెలతో చితకబాదారు. దీంతో భర్త చనిపోగా, భార్య తీవ్రంగా గాయపడింది. అయితే, ఈ ఘటన పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చర్యలు తీసుకోకుండా అక్కడి పరిస్థితి గమనించి తిరిగి వెనక్కి వెళ్లిపోయారు. అనంతరం మర్నాడు ఉదయం వచ్చే సరికి వారి ఆరోగ్య పరిస్థితి పూర్తిగా క్షీణించింది. వెంటనే ఇద్దరిని ఆస్పత్రికి తరలించగా, వృద్ధుడు ఇప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అతడి భార్య పరిస్థితి విషమంగానే ఉందని ప్రస్తుతం చికిత్స పొందుతున్నారని హిసువా కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌? వైద్యులు తెలిపారు. మరోవైపు వృద్ధ దంపతుల్లో భర్త చనిపోగా, భార్యను బతికుండగానే దహనం చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. బుధవారం ఉదయం భర్త మృతదేహంతో పాటే భార్యను సజీవ దహనం చేసేందుకు సిద్ధమైనట్లు అంటున్నారు. ఈ క్రమంలోనే పోలీసులకు మరోసారి సమాచారం అందడంతో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. భార్యను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వృద్ధుడి మృతదేహాన్ని, తీవ్రంగా గాయపడిన స్థితిలో అతడి భార్యను ఆస్పత్రికి తరలించామని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామనీ,

విచారణం వేగం చేసి నిందితులను త్వరలో పట్టుకుంటామని హిసువా పోలీస్ స్టేషన్ ఎస్ఐ రుపా కుమారి తెలిపారు. అంతకుముందు కొన్ని రోజుల క్రితం కూడా ఇలాంటి ఘటనే ఝూర?ండ్?లో జరిగింది. చేతబడి చేశారని ఆరోపిస్తూ వృద్ధ దంపతులను దారుణంగా హింసించారు గ్రామస్థులు. దంపతులకు గుండు కొట్టించి ఊరంతా ఊరేగించారు. దీంతో భాదితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకున్న పోలీసులు దీనికి కారణమైన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. లాతెహార్ జిల్లాలోని మహుందర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని భేడీగాంధార్‌లో ఇటీవలే ఓ వ్యక్తి మరణించాడు. అయితే అదే గ్రామంలో ఉంటున్న వృద్ధ దంపతులు మద్యం మత్తులో అతడిని చేతబడి చేసి ఎవరో చంపారని అన్నారు. దీంతో వారిద్దరే అతన్ని చేతబడి చేసి చంపినట్లు గ్రామస్థులు భావించి వారిని బలవంతంగా లాక్కెళ్లి దారుణంగా కొట్టి హింసించారు. అనంతరం వారిద్దిరికీ గుండు కొట్టి తలపై సున్నం పూసి ఊరంతా ఉరేగించారు. వారికి శుద్ధి (వారినుంచి మంత్ర విద్యలను దూరం చేయడం) చేసేందుకు గ్రామస్థులంతా కలిసి ప్రత్యేక పూజలు చేశారు.



# ఎథెల్ కాటర్‌హామ్ @ 116

## ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలిగా రికార్డు



ఎథెల్ కాటర్‌హామ్.. ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలిగా ఖ్యాతి గాంచారు. ఆమె.. తన 116వ జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఆగస్టు 21వ తేదీ సర్రేలో లైట్‌వాటర్‌లోని సంరక్షణ కేంద్రంలో ఆమె ఈ వేడుకులు చేసుకున్నారు. తన కుటుంబ సభ్యులతో కలిసి  సాదా సీదాగా ఈ జన్మదినాన్ని జరుపుకున్నారని హాల్‌మార్క్ కేర్ హొమ్స్ వెల్లడించింది. ఎథెల్ పుట్టిన రోజు సందర్భంగా ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. అయితే ఈ ఏడాది జన్మదినం సందర్భంగా ఎథెల్ కేటర్ హామ్ ఎవరికి ఎటువంటి ఇంటర్వ్యూలు ఇవ్వ లేదు. అయితే కింగ్ చార్లెస్- 3 ఆమెతో మాట్లాడటానికి సిద్ధంగా ఉంటే అంగీకరిస్తామని సంరక్షణ కేంద్రం వివరించింది. ఇక దేశంలో 100వ జన్మదిన వేడుకలు జరుపుకునే పౌరులను అభినందిస్తూ.. వ్యక్తిగతంగా బ్రిటన్ చక్రవర్తి లేఖ రాస్తారు. ఆ క్రమంలో ఎథెల్ కాటర్‌హామ్‌కు గతేడాది 115వ పుట్టిన రోజు సమయంలో కింగ్ చార్లెస్ 3 లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆమెను అభినందనలతో ముంచెత్తారు. 1909, ఆగస్టు 21వ తేదీన ఎథెల్ కాటర్‌హామ్ జన్మించారు. అంటే టైటానిక్ విపత్తుకు సరిగ్గా మూడేళ్ల ముందు ఆమె జన్మించారు. ఆమె.. తన 18వ ఏటా భారత్‌కు వచ్చారు. భారత్‌లో ఒక సైనిక కుటుంబానికి సహాయకురాలిగా విధులు నిర్వహించేందుకు ఆమె ఈ దేశానికి విచ్చేశారు. తర్వాత ఆమె స్వదేశానికి పయనమయ్యారు. 1933లో నార్మన్ కాటర్‌హామ్‌తో ఆమెకు వివాహం జరిగింది.  1976లో భర్త నార్మన్ కాటర్ హామ్ మరణించారు. ఇక ఎథెల్ కాటర్‌హామ్‌కు ముగ్గురు మనవళ్లతోపాటు ఐదుగురు ముని మనవళ్లు ఉన్నారు. కాగా, ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలు ఇనా కాన్‌బారో లూకాస్. ఆమె వయస్సు 116వ సంవత్సరాలు. నన్‌గా పని చేసే ఆమె 116వ ఏటా మరణించింది. ఈ నేపథ్యంలో ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలిగా ఎథెల్ కాటర్‌హామ్ ఖ్యాతి పొందారు.

# Form - IV
## (See Rule 8)

Statement about ownership and other particulars of the UDBHAVA Telugu Monthly, Hyderabad, as required under Rule 8 of the Registration of News Paper (Central) Rules, 1956.

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | Hyderabad |
| 2. Periodicity of Publications | : | Monthly |
| 3. Printer's Name | : | M. Madhava Vasu |
| Whether Citizen of India? | : | Yes |
| Address | : | 1-24-21/4, (24-387), Plot No.1,<br>Sri Sai Nagar, Lothukunta,<br>Alwal, Secunderabad - 500 015 |
| 4. Publisher's Name | : | M. Madhava Vasu |
| Whether Citizen of India? | : | Yes |
| Address | : | 1-24-21/4, (24-387), Plot No.1,<br>Sri Sai Nagar, Lothukunta,<br>Alwal, Secunderabad - 500 015 |
| 5. Editor's Name | : | M. Madhava Vasu |
| Whether Citizen of India? | : | Yes |
| Address | : | 1-24-21/4, (24-387), Plot No.1,<br>Sri Sai Nagar, Lothukunta,<br>Alwal, Secunderabad - 500 015 |
| 6. Name and address of Individuals who own the Newspaper | : | M. Madhava Vasu |
| | : | 1-24-21/4, (24-387), Plot No.1,<br>Sri Sai Nagar, Lothukunta,<br>Alwal, Secunderabad - 500 015 |

I, M. Madhava Vasu, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-

**M. Madhava Vasu**
(Publisher)